కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని | తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :139 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 18-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-


## టాటా గ్రూప్ ఛైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్..




టాటా గ్రూప్ ఛైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ మరోసారి నియమితులయ్యారు. టాటా సన్స్ గ్రూప్ ఆయనను ఛైర్మన్‌గా మూడోసారి నియమించింది. ఐదేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. గురువారం ముంబైలో జరిగిన బోర్డు మీటింగ్‌లో చంద్రశేఖరన్ నియామకంపై నిర్ణయం తీసుకున్నారు. వరుసగా రెండుసార్లు టాటా గ్రూప్ ఛైర్మన్‌గా ఎన్నికైన చంద్రశేఖరన్ గత ఆగష్టు 12న ఈ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. తన పదవీ కాలం ముగిసిన తర్వాత మళ్లీ బాధ్యతల్లో కొనసాగలేనని స్పష్టం చేశారు. అయితే, చంద్రశేఖరన్‌నే మళ్లీ నియమించడానికి బలమైన కారణ ఉంది. స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు సంబంధించి మినహాయింపు కోరుతూ టాటా గ్రూప్ ఇటీవల ఆర్బీఐకి దరఖాస్తు చేసుకుంది. కానీ, ఈ దరఖాస్తును ఆర్బీఐ తిరస్కరించింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కావడం అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో ఛైర్మన్‌గా నాయకత్వ మార్పు మంచిది కాదనే ఉద్దేశంతో తిరిగి చంద్రశేఖరన్‌నే నియమించాలని బోర్డు భావించింది. టాటా గ్రూప్‌లో అత్యధిక వాటా కలిగిన టాటా సన్స్‌కు ఈ నియామకం చాలా కీలకం. ఆయన నియామకంతో స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు సంబంధించిన ప్రక్రియ సజావుగా సాగుతుందని కంపెనీ వర్గాలు భావిస్తున్నాయి. 2017 నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. మరో ఐదేళ్లపాటు ఛైర్మన్‌గా ఉంటారు. 2017లో తొలిసారి ఛైర్మన్ కాగా, 2022లో మరోసారి నియమితులయ్యారు. ఆయన పదవీ కాలం ఫిబ్రవరి 2027 వరకు ఉంది. చంద్రశేఖరన్ నాయకత్వంలో టాటా గ్రూప్ అనేక వ్యాపారాలకు విస్తరించింది. ముఖ్యంగా టెక్నాలజీ, డిజిటల్ రంగాల్లో దూసుకెళ్తోంది. చంద్రశేఖరన్‌ను ఛైర్మన్‌గా నియమించినప్పటికీ.. ఈ విషయంలో ఆయన నిర్ణయం కీలకం కానుంది. ఆయనను పదవిలో కొనసాగాల్సిందిగా ది నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ విజ్ఞ

## కేసీఆర్‌కు సీఎం క్షమాపణ చెప్పాలి : కేటీఆర్




సీఎం రేవంత్ రెడ్డిఅబద్ధాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైర్ అయ్యారు. గురువారం జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్నటిదాకా నీ కంపు నోరుతో కేసీఆర్ ఫామ్‌హౌస్ 1,000 ఎకరాలు అన్నావు కదా రేవంత్ రెడ్డి.. మరి ఈరోజు నువ్వే కేసీఆర్ కు 67 ఎకరాలు ఉందని చెప్పావు. అప్పుడేమో అలా మాట్లాడావు నీది నోరా, మోరీనా అని ప్రశ్నించారు. 67 ఎకరాలు ఉందని కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నాడు. నువ్వు కనిపెట్టేది ఏంది అని ఘటుగా మందలించాడు. మాకు 1954లోనే వందల ఎకరాల భూమి ఉండేది. మేము స్వతహాగా రైతులం. వ్యవసాయం చేసుకుంటామని కేసీఆర్ ఆనాడే చెప్పారు. నీలాగా మంది కొంపలు ముంచే పని చేయలేదు. ఆస్తులు గుంజుకోలేదన్నారు. కేసీఆర్ రైతు కాబట్టి బరాబర్ అన్ని చట్టాల ప్రకారం భూమి కొనుక్కున్నాడు. వ్యవసాయం చేశాడన్నారు. కేసీఆర్ భూమిని దేవతలాగా కొలుస్తాడు.. నీ లెక్క మంది కొంపలు ముంచి భూమిని ఆటవస్తువుగా చూడడని పేర్కొన్నాడు. ముఖ్యమంత్రిని సూటిగా ఒక్కటే అగుతున్నా... నీ కంపు నోటితో కేసీఆర్‌కు 1000 ఎకరాల భూమి ఉందని తప్పుడు కూతలు కూసి, చిల్లర మాటలు మాట్లాడిన అదే నోటితో కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## 12వ తరగతి చదివారు, డాక్టర్లుగా వైద్యం చేస్తున్నారు..



గాంధీనగర్: కొందరు వ్యక్తులు కేవలం 12వ తరగతి మాత్రమే చదివారు. అయినప్పటికీ డాక్టర్లుగా చెలామణి అవుతూ వైద్యం చేస్తున్నారు. కొన్ని క్లినిక్‌లపై ఆరోపణలు రావడంతో ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు కలిసి సంయుక్తంగా రైడ్ చేశారు. వైద్య డిగ్రీలు లేకుండా వైద్యులుగా నటిస్తూ చికిత్సలు అందిస్తున్న 8 మందిని అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ సంఘటన జరిగింది. పాండేసరా ప్రాంతంలోని పలు క్లినిక్స్‌కు చెందిన వ్యక్తులు సరైన వైద్య అర్హతలు లేకుండా వైద్యులుగా చెలామణి అవుతూ రోగులకు చికిత్స అందిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. కాగా, సూరత్ నగర పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్‌వోజీ), జిల్లా ఆరోగ్య శాఖ సంయుక్తంగా స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. పాండేసరా ప్రాంతంలోని ఎనిమిది వేర్వేరు క్లినిక్‌లపై ఈ బృందాలు రైడ్ చేశాయి. అవసరమైన వైద్య అర్హతలు లేకపోయినా కొందరు వ్యక్తులు వాటిని నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో తెలుసుకున్నారు. ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. మరోవైపు నిందితుల్లో కొందరు కేవలం 12వ తరగతి వరకు మాత్రమే చదవగా, మరికొందరు బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారని పోలీస్ అధికారి తెలిపారు. కొందరు గతంలో కాంపౌండర్లుగా, ఆపరేషన్ థియేటర్ సహాయకులుగా పనిచేసినట్లు చెప్పారు. వైద్య రంగంలో తమకున్న ఈ అనుభవాన్ని ఉపయోగించి డాక్టర్లుగా నమ్మించి రోగులకు చికిత్స అందిస్తున్నారని ఆరోపించారు.

అలాగే రైడ్స్ సందర్భంగా సుమారు లక్ష విలువైన మందులు, ఇంజెక్షన్లు, సిరప్‌లు, ఇతర వైద్య సామాగ్రిని ఆ క్లినిక్స్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి వివరించారు. ఆరోగ్య శాఖ అధికారుల ఫిర్యాదుతో నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల జాబితా ప్రక్రియ షెడ్యూల్ విడుదల




నల్గొండ : 2027 మార్చిలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఖాళీలు ఏర్పడనున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 28న ఓటర్ల జాబితా ప్రక్రియపై ప్రజా నోటీసు, అక్టోబర్ 15న పత్రికల్లో తొలి పునఃప్రచురణ, అక్టోబర్ 25న రెండో పునఃప్రచురణ, నవంబర్ 6 న ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని వెల్లడించింది. నవంబర్ 20న ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణ పూర్తి, నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ , డిసెంబర్ 25న క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం పూర్తి, డిసెంబర్ 30 తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని స్పష్టం చేసింది. ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా కొత్తగా మార్చిన ఫారం-18లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు, సర్టిఫికెట్ల ధృవీకరించిన కాపీలను సమర్పించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

## ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేపై కూలీలపైకి దూసుకెళ్లిన కారు.. ఇద్దరు మృతి

హరియాణాలోని గుర్గావ్ పట్టణానికి సమీపంలో ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన ఒక కారు ఢీకొనడంతో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి 2.30 గంటల తర్వాత గుర్గావ్ ఫ్లై ఓవర్ కింద, న్యూపాలం విహార్ పరిధిలోని శ్రీరామ్ చౌక్ వద్ద జరిగింది. ఘటన జరిగిన సమయంలో నలుగురు కూలీలు ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేపై ఉన్న ఫ్లై ఓవర్ కింద ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రిల్స్ ఏర్పాటు చేసే పనిలో ఉన్న కార్మికులపైకి అతివేగంగా వచ్చిన ఒక కారు దూసుకెళ్లింది. కారు వేగంగా వస్తుండటం చూసిన కార్మికులు ఆ గ్రిల్స్ సమీపం నుంచి పక్కకు దూకేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ కారు వారిని ఢీకొంది. ఈ ఘటనలో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. నలుగురిలో ఇద్దరు కార్మికులు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా కారు నడిపింది 20 ఏళ్ల వేదాన్ ఖన్నాగా గుర్తించారు. ఈ ప్రమాదంలో అతడికి కూడా గాయాలయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుల్ని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరి మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు కారు వేగం ఎంతగా ఉందంటే.. కారు నుజ్జునుజ్జయింది. కారు డ్రైవర్ వేదాన్ కూడా స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కీలకమైన మార్పు..



రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కీలకమైన మార్పుకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ అనుమతి ఇచ్చింది. అడ్వాన్స్‌డ్ రొమ్ము క్యాన్సర్ ఉన్న కొంతమంది రోగులకు ఉపయోగించే క్యామిజెస్ట్రాంట్ అనే ఔషధానికి వేగవంతమైన అనుమతి లభించింది. హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్, హెచ్‌ఈఆర్2 నెగెటివ్ స్థానికంగా అభివృద్ధి చెందిన లేదా ఇతర ప్రాంతాలకు వ్యాపించిన రొమ్ము క్యాన్సర్‌లో, హార్మోన్ చికిత్సతోపాటు సీడీకే4 లేదా సీడీకే 6 నిరోధక మందులు తీసుకుంటున్న సమయంలో ఈఎస్ఆర్1 జన్యు మార్పు కనిపించిన వారికి ఈ ఔషధాన్ని ఉపయోగించవచ్చు. ఈ అనుమతి ప్రత్యేకత ఏమిటంటే, స్కాన్లలో క్యాన్సర్ మళ్లీ అభివృద్ధి చెందుతున్నట్లు కనిపించకముందే రక్త పరీక్ష ద్వారా చికిత్సకు నిరోధకత పెరుగుతోందని గుర్తించి మందును మార్చుకునే అవకాశం కల్పించడం.

## కీలక నాయకుడు అసిమ్ మండల్ లొంగుబాటు..!



మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. సీపీఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ సభ్యుడైన అసిమ్ మండల్ అలియాస్ ఆకాశ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఆయన పశ్చిమబెంగాల్‌లో లొంగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఆయనపై జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలు భారీ మొత్తంలో రివార్డులు ప్రకటించాయి. జార్ఖండ్ ప్రభుత్వం మండల్ తలపై రూ.1 కోటి రివార్డు ప్రకటించగా.. ఒడిశా ప్రభుత్వం రూ.1.20 కోట్లు రివార్డు ప్రకటించింది. మొత్తం మీద ఇతనిపై రూ.2.20 కోట్ల రివార్డు ఉంది. పశ్చిమబెంగాల్‌లోని పశ్చిమ మేదినీపూర్ జిల్లా చంద్రకోన పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉత్తర ఫుల్‌చుక్ గ్రామ నివాసి అయిన అసిమ్ మండల్.. మావోయిస్టు పార్టీలో ఆకాశ్, తిమిర్, మనోజ్, దీపక్, రాకేశ్ వంటి పలు పేర్లతో కార్యకలాపాలు సాగించాడు. ముఖ్యంగా జార్ఖండ్‌లోని కోల్హాన్, సారండా ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా మావోయిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఇతని లొంగుబాటును జార్ఖండ్ పోలీసులు కూడా ధృవీకరించారు. జార్ఖండ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఇతనిపై సుమారు 55 తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో చాలావరకు భద్రతా బలగాలపై దాడులు, ఎన్‌కౌంటర్లకు సంబంధించినవే. 2026 మార్చి 1న చైబాసాలోని మరంగ్‌పొంగ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కోబ్రా 209వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్‌తో సహా ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడటంలో ఇతని పాత్ర ఉంది. అలాగే 2025 ఏప్రిల్ 12న రాధాపోర వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక జార్ఖండ్ జాగ్వార్ జవాన్ మరణించాడు. ఇవేకాక 2023 జనవరి 11న టోంటో పోలీస్ స్టేషన్ పరిధిలోని తుంబహాక అటవీ ప్రాంతంలో జరిగిన ఐఈడీ పేలుడులో 9 మంది కోబ్రా బెటాలియన్ సిబ్బంది గాయపడ్డారు. 2020 మే 31న జోన్వాలో, 2018 జూలై 11 న ఝూటీ పహారీలో జరిగిన దాడుల్లో ఒక్కొక్కరు చొప్పున భద్రతా సిబ్బంది మరణించారు. ఈ ఘటనలన్నింటిలోనూ అసిమ్ మండల్ కీలక సూత్రధారిగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం అసిమ్ మండల్‌ను అదుపులోకి తీసుకున్న భద్రతా ఏజెన్సీలు.. మావోయిస్టుల నెట్‌వర్క్, ఆయుధ నిల్వలు, రహస్య స్థావరాలపై కీలక సమాచారం రాబట్టేందుకు విచారిస్తున్నాయి. ముఖ్యంగా సారండా అడవుల్లో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాల గురించి ఇతని ద్వారా కీలక సమాచారం లభించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న విద్యుత్ సంక్షోభం..

బంగ్లాదేశ్ మునుపెన్నడూ లేనంత తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. దేశ రాజధాని ఢాకాలోనే 4-5 గంటల కరెంట్ కోతలు నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా తీవ్ర విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అసమర్థతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరా చేసే ఇండియా కూడా ఇప్పుడు ఆ దేశాన్ని పూర్తిగా ఆదుకునే పరిస్థితులు లేవు. స్థానిక ప్రజలు చాలా మంది తమకు 90వ దశకం నాటి రోజులు గుర్తుకొస్తున్నాయంటున్నారు. గతంలో కిరోసిన్ దీపాలు వాడే రోజులు మళ్లీ వచ్చాయంటున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,000 మెగావాట్ల నుంచి 3,500 మెగావాట్ల విద్యుత్ లోటు ఉంది. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలో లోపాలు, ఉత్పత్తికి తగినంత చమురు సరఫరా లేకపోవడం వంటివి బంగ్లాదేశ్లో విద్యుత్ కోతలకు కారణాలుగా చెబుతున్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పరిశ్రమలు కూడా విద్యుత్ కొరతతో నిలిచిపోతున్నాయి. చివరికి ఆస్పత్రుల్లో చికిత్స చేయడానికి రాత్రి పూట కూడా విద్యుత్ సరఫరా ఉండటం లేదు. ఒక ఆస్రత్రిలో టార్చ్‌లైట్ల వెలుగులో నర్సులు వైద్యం చేస్తున్న ఫొటోలు వైరల్‌గా మారాయి. బంగ్లాదేశ్‌లో విద్యుత్ సంక్షోభం నివారణకు చమురు చాలా అవసరం. ఆ దేశానికి అవసరమైన చమురును కొంత వరకు ఇండియా సరఫరా చేస్తుంది. 2023లో ఇండియా నిర్మించిన ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ ద్వారా ఆ దేశానికి ఇండియా నుంచి చమురు సరఫరా జరుగుతుంది. అయితే, ఇప్పుడు ఇరాన్ యుద్ధం, అంతర్జాతీయ సంక్షోభం నేపథ్యంలో ఇండియా చమురు కొరతను ఎదుర్కుంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌కు చమురు సరఫరా చేయడం ఇండియాకు కష్టంగా మారింది. దీంతో అక్కడ చమురు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి భారీగా తగ్గింది. ఇదే సమయంలో ఇండియా నుంచి నేరుగా బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరా కూడా జరుగుతుంది. అనేక రాష్ట్రాల్లోని ప్రైవేటు పవర్ ప్లాంట్ల నుంచి బంగ్లాదేశ్‌కు 2,656 మెగావాట్ల విద్యుత్ సరఫరా జరుగుతోంది. కానీ, అనేక అవాంతరాల వల్ల ఇండియా నుంచి కూడా తగినంత విద్యుత్ సరఫరా జరగడం లేదు. ఇలాంటి పలు పరిస్థితుల కారణంగా బంగ్లాదేశ్ విద్యుత్ కొరతను ఎదుర్కుంటోంది. దాదాపు 20 ఏళ్లలో ఇలాంటి సంక్షోభం లేదని స్థానికులు అంటున్నారు.

## గిరిజన హాస్టళ్లలో బాలికలకు ప్రెగ్నెన్సీ పరీక్షలు.. మండిపడ్డ అభిజీత్ దీప్కే

మహారాష్ట్రలోని కొన్ని గిరిజన హాస్టళ్లలో బాలికలకు ప్రెగ్నెన్సీ పరీక్షలు నిర్వహిస్తున్నారని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఈ అంశంపై దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో హాస్టళ్లలోని మౌలిక వసతులపై ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంటినుంచి హాస్టల్‌కు తిరిగి వచ్చిన బాలికలకు గర్భస్త పరీక్షలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. అభిజీత్ దీప్కే తాజాగా మహారాష్ట్ర, నాగ్‌పూర్‌లోని ఒక గిరిజన బాలికల హాస్టల్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా అక్కడి బాలికలు హాస్టల్‌లో ఉన్న పరిస్థితులపై దీప్కేకు వివరించారు. ఒక బాలిక మాట్లాడుతూ.. తాను ఇంటి నుంచి సెలవుల తర్వాత హాస్టల్‌కు రాగానే తమ మేడమ్ ప్రెగ్నెన్సీ పరీక్ష కోసం తనను ఆస్పత్రికి పంపించిందని వివరించారు. మేడమ్ సూచన మేరకు తన సోదరుడితో కలిసి ప్రెగ్నెన్సీ పరీక్ష కోసం హాస్పిటల్‌కు పంపించిందన్నారు. అక్కడ పరీక్ష కోసం అందరూ పెళ్లైన మహిళలే ఉన్నారని, వాళ్లంతా తనను తప్పుగా చూశారని ఆ బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. మరో విద్యార్థిని కూడా ఇదే తరహా ఫిర్యాదు చేసింది. తాను హాస్టల్‌లో చేరగానే తనను కూడా ప్రెగ్నెన్సీ పరీక్ష కోసం పంపించారని ఆవేదన వ్యక్తం చేసింది. బాలికలు సెలవుల్లో ఇంటికి వెళ్లొచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ ఇలా ప్రెగ్నెన్సీ పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి అని పలువురు విద్యార్థినులు తెలిపారు. దీంతో ఈ అంశంపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ గిరిజన హాస్టళ్లలోని విద్యార్థినులకు ఇలా గర్భస్థ పరీక్షలు నిర్వహించడం ఏంటని దీప్కే ప్రశ్నించారు. మహారాష్ట్రలోని మంత్రులు, ఎమ్మెల్యేలు తమ కూతుళ్లకు కూడా ఇలా ప్రెగ్నెన్సీ పరీక్షలు నిర్వహిస్తారా అని దీప్కే ప్రశ్నించారు. అలాగే, 150 మంది ఉండే హాస్టళ్లలో రెండు, మూడు వాష్‌రూమ్‌లు మాత్రమే ఉన్నాయన్నారు. విద్యార్థినులు పడుకోవడానికి సరైన బెడ్స్ కూడా లేవన్నారు. హాస్టళ్లలో సరైన మౌలిక వసతులు కూడా లేవన్నారు. ఇలాంటి హాస్టళ్లలో ప్రజా ప్రతినిధులు తమ పిల్లల్ని చదివిస్తారా అని ప్రశ్నించారు.

## అధికారి బల్లపై వీధి కుక్కలను వదిలిన యువసేన నేతలు.



ముంబై: వీధి కుక్కల సమస్య గురించి అధికారి పట్టించుకోకపోవడంతో యువసేన నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. వీధి కుక్కలను పట్టి సంచుల్లో తెచ్చి అధికారి బల్లపై వాటిని వదిలేరు. ఇది చూసి ఆ అధికారి షాక్ అయ్యారు. అలాగే ఆయన మెడలో నోట్ల దండలు వేసేందుకు యువసేన నేతలు ప్రయత్నించారు. (బజు గావఖు ఔశీతీనివతీం =వశ్రీఘువ హ్తీఘుఎ ఐశీస్త్రం) ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ సంఘటన జరిగింది. సెప్టెంబర్ 15న ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)కు చెందిన యువసేన కార్యకర్తలు నిఫాడ్ నగర్ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. యువసేన జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రంధవే ఒక సంచిని విప్పారు. అందులో ఉన్న చిన్న కుక్కను అధికారి ధీరజ్ భమ్రే టేబుల్‌పై వదిలారు. షాకైన ఆ అధికారి తన కుర్చీ నుంచి లేచి వెనక్కి జరిగారు.

కాగా, మరో సంచిలో తెచ్చిన వీధి కుక్కను కూడా ఆ అధికారి బల్లపై విక్రమ్ వదిలారు. అది భయంతో ఆ టేబుల్‌పై ఒక మూలలో కూర్చొన్నది. ఆ తర్వాత తన బృందంతో కలిసి రూ.20 నోట్లతో చేసిన దండలను అధికారి ధీరజ్ మెడలో వేసేందుకు విక్రమ్ ప్రయత్నించారు. అయితే ఆ కార్యాలయంలోని కొందరు అధికారులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ వాగ్వాదం జరిగింది. పంచాయతీ కార్యాలయం సిబ్బంది ఆ కుక్కలను బయటకు తీసుకెళ్లారు.

మరోవైపు గత ఆరు నెలలుగా వీధి కుక్కల సమస్య గురించి అధికారి ధీరజ్ దృష్టికి పలుసార్లు తీసుకెళ్లినప్పటికీ ఆయన పట్టించుకోలేదని యువసేన జిల్లా అధ్యక్షుడు విక్రమ్ ఆరోపించారు. అందుకే యువసేన కార్యకర్తలు ఈ విధంగా నిరసన తెలిపినట్లు చెప్పారు. 'గణపతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ప్రజలు హారతి కోసం వెళ్తున్నప్పుడు కుక్కలు వెంబడిస్తున్నాయి. చిన్న పిల్లలను అవి కరుస్తున్నాయి. వీధి కుక్కల వల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు' అని విక్రమ్ అన్నారు. ఎనిమిది రోజుల్లోగా ఎలాంటి చర్యలు తీసుకోకపోతే ఆ అధికారి కార్యాయంలోకి మరిన్ని వీధి కుక్కలను వదులుతామని ఆయన హెచ్చరించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## సంపాదకీయం

**శుక్రవారం 18-09-2026**

# జీడీపీ వృద్ధికి జీఎస్టీయే ప్రామాణికమా?

భారతదేశ ఆర్థిక వృద్ధిపై మరోసారి చర్చ మొదలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. ప్రపంచంలోని ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే ఇది గణనీయమైన పురోగతే. అయితే, దేశంలోని వాస్తవ ఆర్థిక కార్యకలాపాలను ఈ వృద్ధిరేటు ప్రతిబింబిస్తోందా? లేదంటే జీడీపీ సిరీస్, ధరలు, గణాంక సవరణలు కలిసి దీన్ని ఎక్కువగా చూపిస్తున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జీఎస్టీ వసూళ్లను ప్రమాణంగా తీసుకోవడంపైనా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.గతనెల స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 1.99లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నిరుడు ఆగస్టుతో పోలిస్తే ఇవి 14.8శాతం అధికం. ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్టు కాలంలో మొత్తం జీఎస్టీ వసూళ్లు సుమారు రూ. 10.43 లక్షల కోట్లు, అంటే దాదాపు 11శాతం వృద్ధి సాధించాయి. రిఫండ్లను మినహాయించిన నికర జీఎస్టీ వసూళ్లు కూడా ఆగస్టులో 8.3శాతం, ఏప్రిల్–ఆగస్టు మధ్య 9శాతం పెరిగాయి. ఈ గణాంకాలన్నీ ఆర్థిక వ్యవస్థలో పన్ను చెల్లింపులు, అధికారిక లావాదేవీలు, వ్యాపార కార్యకలాపాలు బలంగా ఉన్నాయని సూచిస్తున్నాయి. ఈ-వే బిల్లులు ఇదే చెబుతున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ మాత్రం– ఆర్థిక వృద్ధిని 7.8శాతంగా నిర్ధారించడానికి జీఎస్టీ వృద్ధి రేటును చూపడం సరికాదంటున్నారు. గతంలో వసూలైన జీఎస్టీ పరిహార సెస్ ప్రస్తుతం కొనసాగడం లేదు. కాబట్టి, నిరుటి వసూళ్లలో ఉన్న ఆ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత జీఎస్టీ వృద్ధిరేటు అధికారికంగా ప్రకటించిన దానికంటే తక్కువగా ఉంటుందన్నది ఆయన అభిప్రాయం. ఆ ప్రకారమైతే, ఏప్రిల్–ఆగస్టు స్థూల జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11శాతం కాకుండా సుమారు 4.08 శాతానికి, నికర వృద్ధి 1.30శాతానికి పడిపోతుంది. ఆగస్టులో 14.8 శాతంగా ఉన్న అధికారిక వృద్ధి సుమారు 7.5శాతానికి తగ్గుతుంది. ఇక్కడ గార్గ్ లేవనెత్తిన అంశం పూర్తిగా విస్మరించదగినదేమీ కాదు. ఏ వృద్ధిరేటునైనా లెక్కించేటప్పుడు గత, ప్రస్తుత సంవత్సరాల గణాంకాలు ఒకే ప్రాతిపదికపై ఉండాలి. పన్ను వ్యవస్థలో మార్పు వచ్చినప్పుడు దాని ప్రభావాన్ని స్పష్టంగా చూపించాలి.

కొట్టిపారేయాల్సిన పనిలేదు...

ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య కాంతి ఘోష్ మాత్రం పరిహార సెస్‌ను నిరుటి జీఎస్టీ బేస్‌లో కలపడం సరి కాదంటున్నారు. అది తాత్కాలిక పన్ను విధానంలో భాగమనీ, ఇప్పుడది కొనసాగడంలేదు గనుక... ప్రస్తుత జీఎస్టీ వ్యవస్థను అంచనా వేయాలంటే ప్రస్తుత సీజీఎస్టీ, ఎస్జీఎస్టీ, ఐజీఎస్టీలను గత ఏడాదితో పోల్చడమే సరైన విధానమన్నది ఘోష్ అభిప్రాయం. నిరుడు మేలో టెలికాం స్పెక్ట్రమ్ లావాదేవీకి సంబంధించిన సుమారు రూ.10వేల కోట్ల జీఎస్టీ చెల్లింపు జరిగింది. అటువంటి అసాధారణ సందర్భాలతో కూడిన అధిక బేస్‌తో ఈ ఏడాది మేను పోల్చడం వల్ల ప్రస్తుత వృద్ధిరేటు సహజంగానే తక్కువగా కనిపిస్తుందన్నది ఘోష్ వాదన.జీఎస్టీ వసూళ్లు దండిగా ఉండటమన్నది ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయనేందుకు ఒక సంకేతమే కానీ, జీడీపీ వృద్ధినైతే అది నిరూపించదు. జీఎస్టీ వసూళ్లపై పన్ను, దిగుమతులు, పన్నురేట్లలో మార్పులు, కొత్త రిజిస్ట్రేషన్లు, ద్రవ్యోల్బణం, అధికారిక కార్యకలాపాల నిర్మాణం వంటి అనేక అంశాలు కూడా కీలకమైనవే. నిజానికి మొదటి త్రైమాసికంలో నమోదైన 7.8శాతం జీడీపీ వృద్ధిని కొట్టిపారేయాల్సిన పనిలేదు; అలాగని దాన్ని కేవలం ఒక్క ఆధారంతోనే నిర్ధారించుకోవడమూ సరికాదు. కొత్త జీడీపీ సిరీస్‌లో 2022–23ను బేస్ ఇయర్‌గా తీసుకోవడం, మెరుగైన డేటాను ఉపయోగించడం, ధరల కొలతల్లో మార్పులు చేయడం వంటి కారణాలవల్ల లెక్కల్లో మార్పులు వచ్చాయని ప్రభుత్వం, గణాంక సంస్థలు చెబుతున్నాయి. గార్గ్ మాత్రం నిరుడు జీడీపీ సిరీస్‌లో వచ్చిన సవరణలు ప్రస్తుత వృద్ధిరేటును యాంత్రికంగా పెంచే అవకాశముందని అంటున్నారు. ఈ రెండు వాదనల్లోనూ ఉన్న ముఖ్యాంశం– 'జీడీపీ వృద్ధిరేటు వెనుకనున్న డేటా, ధరల సూచీ, ఉత్పత్తి అంచనాలు, బేస్ ఇయర్, రంగాలవారీ పనితీరు అన్నింటినీ పరిశీలించాలి' అని!

అదొక్కటే గీటురాయి కాదు...

ఏతావాతా దేశార్థికం 7.8శాతం వేగంతో వృద్ధి చెందుతోందని చెప్పాలంటే, జీఎస్టీతో పాటు మరికొన్ని సూచికలనూ పరిశీలించాలి. పారిశ్రామిక ఉత్పత్తి ఎలా ఉంది? తయారీ రంగం ఎంత వేగంగా విస్తరిస్తోంది? ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతున్నాయా? ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి? వాస్తవ వేతనాలు పెరుగుతున్నాయా? కుటుంబాల వినియోగ వ్యయం బలంగానే ఉందా? ఎగుమతులు, ఉత్పాదకత ఎలా ఉన్నాయి? బ్యాంకు రుణాలు, వాహన విక్రయాలు, విద్యుత్ వినియోగం వంటి సూచికలు ఏం చెబుతున్నాయి? అనే ప్రశ్నలు కూడా ముఖ్యమైనవే. వీటికి సానుకూల సమాధానాలు లభిస్తే 7.8శాతం జీడీపీ వృద్ధిపై విశ్వాసం మరింత పెరుగుతుంది. గార్గ్ లేవనెత్తిన అంశాలు గణాంకాల పారదర్శకతకు ఉపయోగపడతాయి. ఘోష్ ప్రస్తావించిన పన్ను వ్యవస్థ మార్పు, బేస్ ప్రభావాలు సైతం గమనార్హమైనవే. భారతదేశ జీడీపీ వృద్ధి ఎంత బలంగా ఉందో నిర్ణయించడానికి జీఎస్టీ ఒక్కటే తుది ప్రమాణం కాదు. వాస్తవ వృద్ధిని అనేక త్రైమాసికాల్లోని ఉత్పత్తి, పెట్టుబడి, ఎగుమతులు, ఉపాధి, వేతనాలు, వినియోగం తదితర సూచికల ద్వారా నిర్ధారించాల్సి ఉంది. ఏదిఏమైనా దేశార్థిక వ్యవస్థ చైతన్యవంతంగా ఉందని జీఎస్టీ వసూళ్లు నిరూపిస్తున్నాయి. అయితే, జీడీపీ గణాంకాలపై విశ్వాసం మరింత పెరగాలంటే– అధికారిక జీఎస్టీ వృద్ధి లెక్కలతో పాటు సవరణలు, రిఫండ్ల తరవాత నికర వృద్ధి ఎంతనేది కూడా ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది.

# ముదురుతున్న చమురు సంక్షోభం



టెహ్రాన్:పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధం ఇప్పట్లో సమసిపోయే సూచనలు కనిపించడం లేదు. పైగా యుద్ధం కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలు విసురుతోంది. ఇరాన్– ఇజ్రాయెల్ ఘర్షణల ప్రభావం ఇప్పటికే గల్ఫ్ దేశాలకు పాకింది. తాజాగా సౌదీ అరేబియాలోని కీలక చమురు మౌలిక సదుపాయాలపై డ్రోన్ దాడులు జరగడం, ఈస్ట్– వెస్ట్ చమురు పైప్‌లైన్ మూసివేయడంతో పరిస్థితి పెనం మీదనుంచి పొయ్యిలోకి పడినట్లయింది. హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయంగా సౌదీ అరేబియా ఏర్పాటు చేసుకున్న 1200 కిలోమీటర్ల ఈ పైప్ లైన్ ద్వారా రోజుకు 40 లక్షల బ్యారెళ్ల వరకు చమురును తరలించవచ్చు. ప్రపంచ చమురు సరఫరాలో ఇది దాదాపు నాలుగు శాతం. ఈ పెట్రోలైన్‌ను మూసివేయడంతో భారత్ సహా అనేక దేశాలకు చమురు కొరత తప్పేలా లేదు. ఈ పైప్‌లైన్‌ను లక్ష్యంగా చేసుకుని హూతీలు దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే ఎర్ర సముద్రంలో వ్యూహాత్మకంగా కీలకమైన హనిష్ దీవులను హూతీలు స్వాధీనం చేసుకున్నట్టు తాజా సమాచారం. బాబ్–అల్–మందెబ్ జలసంధికి సమీపంలో హూతీల ప్రభావం పెరగడం చమురు రవాణాకు మరో ముప్పుగా పరిణమిస్తోంది.

మిలిటరీవస్తువులు అన్వేషించండి

ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన రెండు సముద్ర మార్గాలపైనా ఒత్తిడి పెరగడం ఆందోళనకరం. దీని ప్రభావం చమురు మార్కెట్లపై ఇప్పటికే పడింది. బ్రెంట్ ముడిచమురు ధర 107 డాలర్లు దాటింది. ఇది కేవలం చమురు మార్కెట్ సమస్య కాదు. ముడిచమురు ధర పెరిగితే రవాణా వ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం అదుపు తప్పే అవకాశం ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉంటుంది. అంటే పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచంలోని ప్రతి కుటుంబంపైనా పడే పరిస్థితి ఏర్పడుతుంది. భారత్‌పై ఈ పరిణామాలు మరింత ప్రభావం చూపిస్తాయి. మన దేశం తన ముడి చమురు అవసరాల్లో అధిక భాగం దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది. అందువల్ల అంతర్జాతీయ చమురు ధరల్లో భారీ పెరుగుదల దేశ వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం, రూపాయి విలువపై ప్రభావం చూపుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రమే కాకుండా ఎరువులు, రసాయనాలు, రవాణా, పరిశ్రమల వ్యయాలపైనా దాని ప్రభావం ఉంటుంది. అయితే ప్రస్తుత సంక్షోభ సమయంలో భారత్ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, దేశంలో ఇంధన సరఫరాలు ప్రస్తుతం స్థిరంగానే ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం గట్టిగా చెబుతోంది. కానీ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందన్నదే అసలు ప్రశ్న. తాత్కాలిక అంతరాయాలను ఎదుర్కోవడం ఒక సవాల్ కాగా, నెలల తరబడి కొనసాగే చమురు సరఫరా సంక్షోభాన్ని ఎదుర్కోవడం మరో సవాల్. పశ్చిమాసియా యుద్ధానికి ముగింపు పలికితే తప్ప ఈ సంక్షోభం తీరదన్నది నిర్వివాదాంశం.

ఇంధనసరఫరా కనుగొనండి

యుద్ధంలో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అన్న లెక్కల కంటే శాంతి ఎలా నెలకొంటుందన్నదే ముఖ్యమైనది. గల్ఫ్ దేశాలు ఇరాన్‌తో జరపాల్సిన చర్చలను వాయిదా వేయడం వల్ల పరిస్థితి ఎంత సున్నితంగా మారిందో చెప్పడానికి తాజా పరిణామాలే ఒక ఉదాహరణ. దౌత్య మార్గాలను మూసివేసి సైనిక మార్గాన్నే ఎంచుకుంటే సంక్షోభం మరింత విస్తరించే ప్రమాదం ఉంది. అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలు, ఇరాన్ తదితర పక్షాలు తమ తమ ప్రయోజనాల కంటే ప్రపంచ శాంతికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఇది. ముఖ్యంగా హర్మూజ్, బాబ్–అల్–మందెబ్ వంటి అంతర్జాతీయ జలమార్గాల భద్రతకు బలమైన వ్యవస్థ అవసరం. చమురు సరఫరాను ఒక ఆయుధంగా మలచుకుని కొన్ని దేశాలు ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెట్టడాన్ని ఇకపై చూస్తూ ఊరుకోలేం. పశ్చిమాసియా యుద్ధం ఇప్పుడు ఆ ప్రాంత ప్రజల సమస్యగా మాత్రమే మిగలలేదు. అది ప్రపంచ ఇంధన భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి, ఆహార భద్రతకు, అంతర్జాతీయ వాణిజ్యానికి సవాలుగా మారింది. బాంబుల మోత ఆగకపోతే చమురు ధరల మంట ప్రపంచమంతా వ్యాపించే ప్రమాదం ఉంది. అందుకే యుద్ధంలో మరో దాడి కోసం కాకుండా, శాంతి స్థాపన కోసం ప్రపంచ దేశాలు కృషి చేయాలి.

# ఐవీ కొనేది రూ.11కు.. రోగులకు అమ్మేది మాత్రం రూ.325కు



హైదరాబాద్: దేశంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు తమకు అడ్డూ అదుపు లేదనే విధంగా అటు అధికారులను ఇటు రాజకీయ నాయకులకు మామూళ్లు ముట్టచెప్పి చికిత్స కోసం వచ్చే రోగులను నిలువుదోపిడి చేస్తూ వస్తున్నాయి. రోగులు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల బదులు చిన్న చిన్న రోగాలకు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. రోగుల బలహీనత, ఆరోగ్యం పై శ్రద్ధను ఆసరాగా చేసుకుని వచ్చినంత వరకు పిండేస్తూ వాళ్ల జేబులను ఖాళీ చేస్తున్నాయి. దీంతో మెజారిటీ రోగులు అప్పుల పాలవుతూ స్థిరాస్తులు తెగనమ్ముకునే పరిస్థితులు దాపురించాయి. ఆసుపత్రులలో రోగులకు వాడే మందులు, వైద్య పరికరాలు (శస్త్ర చికిత్స వస్తువులు) లో పెద్ద ఎత్తున దోపిడికి పాల్పడుతున్నాయి. కంపెనీలు నిర్ణయించే ధరలపై 2,841 శాతానికి పైగా అధికంగా వసూలు చేస్తున్నట్లు సర్వేలో వెల్లడయింది. ఈ సర్వే లోని ధరలను చూసి మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ కూడా విస్తుపోయింది. ఇవేమీ ధరలు అంటూ ఆగస్టు 10వ తేదీన డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్, నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీకి లేఖలు రాసింది. రోగుల జేబులను ఖాళీ చేస్తున్న అంతులేని ధరలపై చర్యలు తీసుకోవాలని కోరింది.మహారాష్ట్రలో ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ దూకుడుగా చర్యలు తీసుకుంటూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నది. ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ఎక్కడెక్కడ దోపిడి జరుగుతున్నది, వ్యాపారులు ఎలా కోట్లకు పడగలెత్తుతున్నారు, ప్రజలు ఏం చేయాలనే దానిపై ఆహార, పానీయ సంస్థలను విక్రయించే దుకాణాలు, పలు కంపెనీలపై దాడులు నిర్వహిస్తున్నది. పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తూ కల్తీ, అపరిశుభ్ర వాతావరణం ఉన్న వ్యాపార సంస్థలను మూసివేస్తూ నోటీసులు జారీ చేస్తున్నది. కంపెనీలకు సైతం నోటీసులు జారీ చేస్తున్నది. ప్రముఖ వ్యాపార సంస్థలు కూడా ఈ జాబితాలో ఉండడంతో ముంబై పౌరులు సైతం అప్రమత్తమయ్యారు. ఇంతకాలం తాము పరిశుభ్రత లేని, నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, బేకరీలు, ఐస్ క్రీమ్ పార్లర్లకు వెళ్లామా అని బాధపడ్డారు. తాజాగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులలో జరుగుతున్న మోసాలపై కన్నేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులలో మందులు, వైద్య పరికరాలపై సర్వే నిర్వహించింది. ఈ సర్వేను అధ్యయనం చేయగా పలు మోసాలు వెలుగు చూశాయి. ఇన్ పేషెంట్ల కు అవసరమైన వైద్య పరికరాలు, శస్త్ర చికిత్స వస్తువులు విరివిగా ఉపయోగిస్తుంటారు. ఈ సమయంలో రోగులు వారి బంధువులు ధరలను పెద్దగా పట్టించుకోరు. కారణం ఏమంటే పేషెంట్ బతికితే చాలు అనే విధంగా మిన్నకుండిపోతారు. ఇందులో ఇంట్రావీనస్ ఇన్ఫ్యూజన్ సెట్స్, సిరంజీలు, నెబులైజర్లు, ఆక్సిజన్ మాస్కులను ఎవరూ ఊహించని విధంగా అత్యధిక ధరలకు బిల్లులు వేస్తున్నట్లు తేలింది. బహిరంగ మార్కెట్ తో పోల్చితే ఎంతో వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టం అయింది. హోల్ సేల్ ధరలకు కొనుగోలు చేసి, అత్యధిక మార్జిన్ తో రోగులకు అంటగడుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఉదాహరణకు క్యాథటర్ ఒకటి రూ. 29.41 పైసలకు కొనుగోలు చేసి రూ. 310 చొప్పున బిల్లు వేస్తున్నారు. అంటే ఒక రోగి నుంచి రూ. 280.59 పైసలు అత్యధికంగా తీసుకుంటున్నారు. అదే విధంగా ఐవీ ఫ్యూజన్ సెట్ ఒకటి రూ. 11.05 పైసలకు కొనుగోలు చేసి, రోగులకు రూ. 325 చొప్పున బిల్లు వేసి వసూలు చేస్తున్నారు. కంపెనీలు లేదా హోల్ సేల్ వ్యాపారుల నుంచి ఆసుపత్రి యాజమాన్యాలు కొనుగోలు చేసి, వాటికి అత్యధికంగా 2,841 శాతానికి పైగా అధిక ధరను ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. వీటిని కూడా అప్పు కింద కొనుగోలు చేసి, విక్రయాలు జరిగిన తరువాత వ్యాపారులు లేదా కంపెనీలకు చెల్లింపులు చేస్తున్నారు. లాభాల్లో కూడా హేతుబద్ధంగా ఉండాల్సిన ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా రోగుల బలహీనతలను ఆసారా చేసుకుని నిలువు దోపిడి చేస్తున్నాయి. ప్రభుత్వ నియమావళి ని పూర్తిగా ఉల్లంఘిస్తూ మోసాలకు పాల్పడుతున్నాయి. ఇక్కడ ధరల దోపిడి కాకుండా రోగుల హక్కులను కాపాడుతూ, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ వ్యవస్థలపై ఉంది.ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులలో అడ్డగోలు దోపిడి పై మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ తుకారామ్ ముండే మాట్లాడుతూ, రోగులకు ఈ ధరలపై అవగాహన లేకపోవడం, వారిలో చైతన్యం కొరవడడం ప్రధాన కారణమన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగానే బిల్లులు వేస్తున్నాయా అనేది తెలియకపోవడమే ప్రధాన సమస్య అన్నారు. ఉత్పత్తిదారుడి నుంచి మధ్యవర్తి లేదా హోల్ సేల్ వ్యాపారి ద్వారా ఆసుపత్రి యాజమాన్యాలకు ఏ ధరకు వస్తున్నాయి, ఆసుపత్రి యాజమాన్యాలు ఎంత లాభంతో రోగులకు బిల్లు వేస్తున్నారనేది అధికారులు కూడా విచారణ జరిపారన్నారు. ఎంతో వ్యత్యాసం ఉన్నట్లు తేలిందని, నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ కూడా దీనిపై విచారణ చేస్తున్నదని ముండే పేర్కొన్నారు. ఏ ధరకు విక్రయిస్తున్నది కూడా ఉత్పత్తి చేసే కంపెనీలు ఎప్పటికప్పుడు నివేదికలు అథారిటీకి అందచేస్తాయన్నారు. మహారాష్ట్ర కాకుండా పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు కు చెందిన డ్రగ్ కంట్రోల్ నుంచి నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ కి పలు ఫిర్యాదులు వెళ్లాయన్నారు.డ్రగ్స్ (ప్రైస్ కంట్రోల్) ఆర్డర్ – 013 ప్రకారం వైద్య పరికరాలను అత్యధికంగా ఎంత మేరకు విక్రయించాలనే దానిపై సీలింగ్ విధించిందన్నారు. ఎడాది వ్యవధిలోపు పది శాతానికి మించి అత్యధిక మార్జిన్ తో రోగులకు విక్రయించడానికి వీలు లేదని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. కరోనరీ స్టెంట్లు, మోకాలు శస్త్ర చికిత్సలో ఉపయోగించే కృత్రిమ పరికరాల ధరలను నియంత్రిస్తూ ప్రత్యేక ఆదేశాలు ఉన్నాయన్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్ తో పాటు ఇతరత్రాలపై అధిక ధరలు వసూలు చేయకుండా నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ నిరంతరం పర్యవేక్షణ చేసిందని తుకారాం ముండే వివరించారు.

# ఆసియా కుబేరుల జాబితాలో అదానీ వెనక్కి.. అగ్రస్థానంలో టిక్‌టాక్ ఫౌండర్

న్యూఢిల్లీ, ఆసియా కుబేరుల జాబితాలో అగ్రస్థానం మారింది. భారత పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ ని వెనక్కి నెట్టి, ప్రముఖ సోషల్ మీడియా యాప్ 'టిక్‌టాక్ ' మాతృసంస్థ 'బైట్‌డ్యాన్స్ ' వ్యవస్థాపకుడు జాంగ్ యిమింగ్ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా అవతరించారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. ఆయన నికర సంపద ప్రస్తుతం 105 బిలియన్ డాలర్లను దాటింది.గత కొన్నేళ్లుగా జాంగ్ సంపద అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. 2019 మార్చిలో కేవలం 13 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆయన ఆస్తి విలువ, ఇప్పుడు ఏకంగా ఎనిమిది రెట్లకుపైగా వృద్ధి చెందడం గమనార్హం. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో బైట్‌డ్యాన్స్ దూకుడుగా విస్తరించడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. డౌబావో చాట్‌బాట్, సీడ్యాన్స్ వీడియో జనరేషన్ టూల్ వంటి ఏఐ ఉత్పత్తుల విజయంతో కంపెనీ విలువ భారీగా పెరిగింది.ఈ నెలలోనే బ్లాక్‌రాక్, ఫిడెలిటీ వంటి అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు బైట్‌డ్యాన్స్ వాల్యుయేషన్‌ను సవరించడంతో జాంగ్ సంపద మరో 12 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. మరోవైపు గౌతమ్ అదానీ సంపద ఈ ఏడాది జూన్‌లో దాదాపు 120 బిలియన్ డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరినప్పటికీ ఇటీవలి కాలంలో కొంతమేర క్షీణించింది. ఎంఎస్‌సీఐ ఇండెక్స్‌లో స్టాక్ రీబ్యాలెన్సింగ్, పెరుగుతున్న ముడి చమురు ధరలు, బాండ్ యీల్డుల వంటి అంతర్జాతీయ మార్కెట్ ఒత్తిళ్లు ఆయన సంపద తగ్గడానికి కారణమయ్యాయి. ఈ పరిణామం ఆసియాలో సంపద సృష్టి స్వరూపాన్ని మారుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంధనం, మౌలిక సదుపాయాల వంటి సంప్రదాయ రంగాలను టెక్నాలజీ, ఏఐ ఆధారిత కంపెనీలు అధిగమిస్తున్నాయనడానికి ఇది నిదర్శనమని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే చైనాలో అత్యంత సంపన్నుడిగా ఉన్న జాంగ్, ఇప్పుడు ఆసియా అగ్రస్థానానికి చేరడం ఈ మార్పును స్పష్టంచేస్తోంది.

# సైఫాబాద్ పీఎస్‌లో జరిగిన దాడి నిజమే..

## ఒప్పుకున్న ప్రభుత్వం




హైదరాబాద్,సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లోపల జరిగిన దాడి ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ పీఆర్ఓ మహేష్ ముదిరాజ్, పీఏ మహేందర్‌పై జరిగిన దాడి ఘటనపై హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ రిట్ పిటిషన్ వేయగా.. రిట్ పిటిషన్ ఈ రోజు విచారణకు వచ్చింది. విచారణ సందర్భంగా దాడి ఘటనపై ప్రభుత్వం తరఫు న్యాయవాది కీలక వ్యాఖ్యలు చేశారు. జరిగిన ఘటనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని కోర్టుకు తెలిపామన్నారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ భవనం నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉందని.. ఈ ఘటనపై నమోదు చేయాల్సిన కేసుల కోసం కోర్టును ఆశ్రయించామని హైకోర్టుకు తెలిపారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో దాడి ఘటన జరిగిన విషయాన్ని కోర్టు ముందు ప్రభుత్వం అంగీకరించినట్టయింది.వచ్చింది డీజే పర్మిషన్ కోసం అని మొన్న ఎలాంటి దాడి జరగలేదన్న డీసీపీ శిల్పవల్లి ప్రకటనపై ప్రశ్నలు సంధించారు. డీజే పర్మిషన్లకు పోలీస్ స్టేషన్ రావాల్సిన అవసరం లేదు ఆన్‌లైన్‌లో తీసుకుని పద్ధతి ఉందన్న బీఆర్ఎస్ న్యాయవాదులు.. దాడి జరగలేదన్న డీసీపీ శిల్పవల్లి వ్యాఖ్యలు అవాస్తవమని తేలిందన్నారు. దుండగులు మారణాయుధాలతో దాడికి వచ్చారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు తమ వాదన వినిపించారు.దుండగుల వద్ద కత్తులు లేవన్న ప్రభుత్వ వాదనపై కోర్టులో వాదోపవాదాలు జరుగగా.. మారణాయుధాలు దాచుకొని వచ్చారు అని బీఆర్ఎస్ లాయర్లు అంటే వారి వద్ద కత్తులు లేవని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. ఏ మారణాయుధాలు తీసుకొచ్చారో ప్రభుత్వ న్యాయవాదికే తెలుసు అన్న బీఆర్ఎస్ లాయర్లు అనడంతో సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఘటన జరిగిన నాటి సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరచాలని కోర్టు ఆదేశించింది. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిరక్షించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# చేరికలకు బ్రేక్...

అమరావతి,జనసేన పార్టీ నాయకత్వం ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉంది. జనసేనలో చేరికలు లేవు. సొంత సామాజికవర్గం నేతలే జనసేనలో చేరకుండా కూటమిలోని టీడీపీలో చేరుతున్నారు. దీనికి కారణం ఏంటి? లోపాలు ఎక్కడ? అన్నదానిపై సమీక్ష చేసుకోవాల్సిన పరిస్థితి ఆసన్నమయింది. తాజాగా ఉత్తరాంధ్రలో జనసేన బలోపేతానికి చిన్న శ్రీనును చేర్చుకోవాల్సి ఉండగా, ఆయన పసుపు కండువా కప్పుకోవడం పార్టీలోనూ చర్చనీయాంశమైంది. నాయకత్వంలో ఏకపక్ష నిర్ణయాలు, తమకు రాజకీయ భవిష్యత్ ఉండదన్న భావన ఎక్కువగా ఉండటం వల్లనే జనసేనలో చేరికలు లేవన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. జనసేన పార్టీలో 2024 ఎన్నికల తర్వాత ఆశించిన స్థాయిలో చేరికలు లేకపోవడానికి, లేదా వలసలపై పార్టీ ఆచితూచి అడుగులు వేయడానికి ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. గతంలో చేరికలపై కొన్ని విమర్శలు వచ్చినప్పటికీ, ప్రస్తుతం 2026 నాటికి పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా 14 మంది సభ్యులతో కూడిన 'జాయినింగ్స్ కమిటీ'ని ఏర్పాటు చేసి, పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారు... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇతర పార్టీల నుంచిప్రధానంగా వైసీపీ నేతలను చేర్చుకుంటే, స్థానికంగా ఉన్న టీడీపీ లేదా బీజేపీ నేతలతో వివాదాలు వచ్చే అవకాశం ఉంటుంది. కూటమిలో ఎలాంటి ఘర్షణలు రాకూడదనే ఉద్దేశంతోనే చేరికలపై జనసేన అధినాయకత్వం ఆచితూచి వ్యవహరించింది. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన పరిమిత సంఖ్యలోనే పోటీ చేసింది. భవిష్యత్తులో కూడా సీట్ల సర్దుబాటు ఉంటుంది కాబట్టి, ఇతర నియోజకవర్గాల నుండి పెద్ద నేతలు వచ్చినా వారికి టికెట్లు ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చు. ఈ క్లారిటీ ఉండటం వల్లే వలసలు నెమ్మదించాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుండి జెండా మోసిన పాత నాయకులు, 'వీర మహిళలు', కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. ఎన్నికల తర్వాత ఇతర పార్టీల నుండి వచ్చే వలస నేతలకు ప్రాధాన్యత ఇస్తే, సొంత క్యాడర్ అసంతృప్తికి గురవుతుందనే ఆలోచన కూడా ఉంది. గతంలో పార్టీలో చేరిన కొందరు నేతలకు తగిన ప్రాధాన్యత దక్కలేదనే టాక్ నడిచింది. అలాగే క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి కమిటీల ఏర్పాటు ఆలస్యం కావడం వల్ల కూడా కొత్తగా చేరే వారికి సరైన దిశానిర్దేశం లేకుండా పోయింది ఎన్నికల విజయం తర్వాత పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖల మంత్రిగా ప్రభుత్వ బాధ్యతల్లో బిజీ అయ్యారు. దీనివల్ల రాజకీయ చేరికల కంటే పాలనపై, గ్రామాల అభివృద్ధిపై ఆయన ఎక్కువ సమయం కేటాయించారు. ఈ గ్యాప్‌ను భర్తీ చేయడానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జూన్ 2026లో 14 మంది సభ్యులతో ఒక అధికారిక చేరికల కమిటీని ఏర్పాటు చేశారు. ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలను పార్టీలోకి క్రమపద్ధతిలో ఆహ్వానించ డానికి మరియు పార్టీ సభ్యత్వ నమోదును భారీగా పెంచడానికి ఈ చర్యలు చేపట్టారు. కానీ జనసేనలోచేరాలంటే షరతులు వర్తిస్తాయి అన్నట్లు వ్యవహారం ఉందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అలాగే జనసేనలో చేరి సీటు సంపాదించడం కంటే టీడీపీ, బీజేపీలో చేరి టిక్కెట్ పొందడం సులువు అన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీనివల్లనే చేరికలు పెద్దగా లేవన్నది సుస్పష్టం. చేర్చుకున్న నేతలతో పార్టీ బలోపేతం అవుతుందన్నదీ నిజం కాకపోవచ్చు. కానీ పార్టీని బలోపేతం చేయాలంటే ప్రస్తుతమున్న నాయకత్వానికి పగ్గాలు అప్పగిస్తే ఫలితం అనుకూలంగా ఉంటుందన్నఅభిప్రాయం జనసేనలో ఎక్కువగా వినపడుతుంది.

# ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పిన ప్రభుత్వం?

హైదరాబాద్ ,ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రెండు డీఏలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఉద్యోగ సంఘాలు పీఆర్?సీ నివేదిక సహా పలు సమస్యలను వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. అన్ని అంశాలపై ఆర్థిక శాఖ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ నెల 18న ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించనున్నందున ఆరోజు ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# ఆకలికి సెలవు.. చదువుకు వెలుగు!




కరీంనగర్ : పిల్లల కడుపు నిండితేనే చదువుపై పూర్తి శ్రద్ధ.. ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తుకు బలమైన పునాది! అనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పాఠశాల అల్పాహార కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో ఘనంగా ప్రారంభమైంది. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియాభాగస్వామ్యంతో కరీంనగర్ మార్కెట్‌యార్డులో సుమారు రూ.8 కోట్లతో నిర్మించిన భారీ కేంద్రీకృత సామూహిక వంటశాలనుమంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు.

ఒకే వంటశాల.. 49,025 మంది విద్యార్థులకు అల్పాహారం!

కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల పరిధిలోని17 మండలాల్లో 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ వంటశాల నుంచి అల్పాహారం సరఫరా కానుంది.మొత్తంగా49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉచితంగా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందనుంది.

హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధునాతన వంటశాల

పెద్ద సంఖ్యలో విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని ఒకే విధమైన ప్రమాణాలతో అందించేలా వంటశాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దారు.ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారీ యంత్రాలతో పాటు కూరగాయలు కడగడం, కోయడం, పాత్రలు శుభ్రం చేయడం, చట్నీ పొడి తయారు చేయడం వంటి పనులకు ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేశారు.ఆహార నాణ్యతను పరీక్షించేందుకు ప్రత్యేక ప్రయోగశాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.వంటశాలను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. అక్కడి ఏర్పాట్లు, యంత్రాల పనితీరు, ఆహార తయారీ, పరిశుభ్రత ప్రమాణాలపై నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించిన మంత్రి పొన్నం

కార్యక్రమ ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి, వారితో కలిసి అల్పాహారం చేశారు.ఉదయం ఆకలితో పాఠశాలకు వచ్చే పరిస్థితి లేకుండా పిల్లలకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, హాజరు, సమయపాలన, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.“గతంలో పిల్లల ఎదుగుదలకు భూములు, నిధులు ఇచ్చేవారు.. ఇప్పుడు ప్రభుత్వం పిల్లలకు ఇవ్వగలిగే గొప్ప సంపద విద్య. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యం.”ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నామని, ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు కూడా మద్దతు ఇవ్వాలని మంత్రి కోరారు.

కోడంగల్‌లో ఫలితాలు.. రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ

2024 డిసెంబర్‌లో కోడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా పాఠశాల అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలన మెరుగుపడినట్లు తెలిపారు.ఈ అనుభవంతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.31 జిల్లాల్లో 31 కేంద్రీకృత వంటశాలలు ఏర్పాటు చేసి సుమారు 17.72 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా ప్రతిపాదనలు రూపొందించారు.

రోజుకో రుచికరమైన అల్పాహారం

విద్యార్థులకు ఇళ్లలో సాధారణంగా తినే ఆహార పదార్థాలతో మెనూను రూపొందించారు. సోమవారం ఇడ్లీ--సాంబార్, మంగళవారం పూరీ–ఆలూ కుర్మా, బుధవారం దోశ–చట్నీ, గురువారం ఉప్మా–చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ–సాంబార్, శనివారం బోండా–చట్నీ అందించనున్నారు. రోజు విడిచి రోజు పాలు పంపిణీ చేస్తారు. మెనూ రూపకల్పనలో జాతీయ పోషకాహార సంస్థ సహకారం తీసుకున్నారు.

పిల్లల ఆరోగ్యం.. చదువుపై ఏకాగ్రతే లక్ష్యం

ఆకలితో ఉన్న విద్యార్థి చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.పిల్లలకు ఉదయమే పోషకాహారం.. తల్లిదండ్రులకు సమయం, ఆర్థిక భారం నుంచి ఉపశమనం.. ఉపాధ్యాయులకు బోధనపై పూర్తి దృష్టి– ఈ మూడు ప్రయోజనాలను కల్పించేలా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.హుస్నాబాద్ 16,544, మానకొండూర్ 8,645, చొప్పదండి 7,48, కరీంనగర్ 16,355, మొత్తం 49,025 మంది విద్యార్థులు.

సేవా కార్యక్రమాల్లో హరే కృష్ణ ఫౌండేషన్..

హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వంతో భాగస్వామ్యంగా విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగస్వామ్యమైన ఫౌండేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి కౌంటియా దాస స్వామీజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇద్దరు యువతులను మోసం చేసిన కానిస్టేబుల్ అరెస్ట్

హైదరాబాద్,ఇద్దరు యువతులును మోసం చేసిన ఓ కానిస్టేబుల్‌ను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పదేళ్లుగా ప్రేమించిన ఓ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసి.. ఆపై మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో అటు ప్రియురాలు, ఇటు భార్య ఇద్దరూ కలిసి కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేశారు.ఖమ్మం జిల్లాకు చెందిన అరుణ్ కుమార్ సీఐడీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తన క్లాస్‌మేట్‌తో పదేళ్లుగా ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి మోసం చేసి.. ఆపై ముఖం చాటేశాడు. ప్రేమించిన యువతికి తెలియకుండా జులైలో మరో యువతిని వివాహం చేసుకున్నాడు. అనుమానం వచ్చిన ప్రేమికురాలు ఆరా తీయగా పెళ్లి విషయం బయటపడింది. మోసపోయాయని గ్రహించిన బాధితురాలు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో అరుణ్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు.. నిందితుడిని అరెస్ట్ చేశారు. అరుణ్‌కుమార్ అరెస్ట్ విషయం తెలుసుకున్న అతని భార్య ఖమ్మంలో అతనిపై ఫిర్యాదు చేసింది. దీంతో ఖమ్మం పోలీసులు కానిస్టేబుల్‌పై మరో కేసును నమోదు చేశారు..

# ఉచిత హామీలతో ఉచ్చు...



హైదరాబాద్,ప్రధాన ఎన్నికల హామీలకు సంబంధించిన ఐదేళ్ల ఆర్థిక వ్యయం, నిధుల సమీకరణ మార్గాలను వెల్లడించడం, స్వతంత్ర ఆర్థిక పరిశీలనకు అవకాశం కల్పించడం, మేని ఫెస్టో హామీలపై పారదర్శకతను పెంచడం అవసరం. రాష్ట్రాలు మధ్యకాలిక వ్యయ ప్రణాళికలను రూపొందించాలి. తద్వారా పునరావృత సంక్షేమ వ్యయాలు మూలధన పెట్టుబడులకు అడ్డంకిగా మారకుండా చూడవచ్చు. ఎంపిక సంక్షేమమా? అభివృద్ధా? అన్నది కాదు. లక్ష్యం అభి వృద్ధి ద్వారా సంక్షేమాన్ని అందించడమే కావాలి. పేదలకు సామాజిక భద్రత, మహిళలకు ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగాలు అవసరం.భారత ప్రజాస్వామ్యంలో సంక్షేమ రాజకీయాలు కొత్త దశలోకి ప్రవేశిస్తున్నాయి. అభివృద్ధి, ఉపాధి, పాలన, సిద్ధాంతాలపై మాత్రమే ఎన్నికలు జరగడం లేదు. ఓటర్లకు తక్షణంగా ఎక్కువ ప్రయోజనాలు ఎవరు అందిస్తారనే పోటీ కూడా పెరుగుతోంది. బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం, ఉచిత విద్యుత్, సబ్సిడీ ఆహారం, ఉచిత రవాణా, రుణ మాఫీలు, వంటగ్యాస్ సిలిండర్లు.. ఇలా ప్రభుత్వ ప్రయోజనాల జాబితా విస్తరిస్తోంది.ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకున్న షరతుల్లేని నగదు బదిలీ పథకాలు (యుసిటి) ఈ ధోరణికి ప్రతీకగా మారాయి. అసోం ‘ఒరునోదోయ్’, పశ్చిమ బెంగాల్ ‘లక్ష్మీర్ భండార్’, కర్ణాటక ‘గృహలక్ష్మి’, మధ్యప్రదేశ్ ‘లాడ్లీ బెహనా’, తమిళనాడు ‘మగలిర్ ఉరిమై తొగై’, మహారాష్ట్ర ‘లాడ్కీ బహిన్’, ఒడిశా ‘సుభద్ర’ వంటి పథకాలు సంక్షేమాన్ని ఎన్నికల పోటీలో కీలక అంశంగా మార్చాయి. పిఆర్ఎస్ అంచనా ప్రకారం.. 202526లో 12 రాష్ట్రాలు ఇటువంటి నగదు బదిలీల కోసం సుమారు రూ.1.68 లక్షల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాయి.పేదలు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలవడంలో తప్పేమీ లేదు. గౌరవప్రదమైన జీవనోపాధిని పొందలేని వారికి సామాజిక భద్రత కల్పించడం సంక్షేమ రాజ్య బాధ్యత. అయితే దీర్ఘకాలిక ఆర్థిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోకుండా.. ఎన్నికల కోసం సంక్షేమ పథకాలు అంతకంతకూ విస్తరించడం ఆందోళన కలిగించే అంశం. రాజకీయంగా వీటి ఆకర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. రహదారి, రైల్వే, పారిశ్రామిక పార్కు లేదా విశ్వవిద్యాలయం వంటి అభివృద్ధి ప్రాజెక్టులు ఫలితాలు ఇవ్వడానికి ఏళ్లు పడుతుంది. కానీ నగదు బదిలీ ప్రతి నెలా నేరుగా కుటుంబ ఖాతాలోకి చేరుతుంది. అందుకే మహిళలు ఈ కొత్త రాజకీయ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మారుతున్నారు.అసోంలోని ‘ఒరునోదోయ్’ ఇందుకు ఒక ఉదాహరణ. 2026 నాటికి దాదాపు 40 లక్షల మంది మహిళలు ఈ పథకం పరిధిలోకి వచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సుమారు 40 లక్షల మంది మహిళలకు రూ. 9,000 చొప్పున బదిలీ చేయగా.. దాదాపు రూ. 3,600 కోట్ల వ్యయం అయింది. ఆ తర్వాత నెలవారీ సాయాన్ని దశలవారీగా రూ. 3,000కు పెంచుతామని, లబ్ధిదారుల సంఖ్యను కూడా విస్తరిస్తామని బిజెపి హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో బిజెపి 126 స్థానాలున్న అసెంబ్లీలో 82 సీట్లు గెలుచుకుంది. అయితే ఆ విజయానికి ఒక్క ‘ఒరునోదోయ్’నే కారణమని చెప్పడం సరికాదు. అయినప్పటికీ ప్రత్యక్ష నగదు బదిలీలకు ఉన్న ఎన్నికల ప్రాధాన్యాన్ని ఈ పరిణామం స్పష్టం చేస్తుంది.పశ్చిమ బెంగాల్‌లో ‘లక్ష్మీర్ భండార్’ తృణమూల్ కాంగ్రెస్ సంక్షేమ రాజకీయాల్లో కీలకంగా మారింది. దీనిని వ్యతిరేకించడానికి బదులుగా బిజెపి మహిళలకు మరింత ఎక్కువ మొత్తాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. దీంతో పోటీ సంక్షేమం అవసరమా? అన్న దానికంటే.. ఎవరు ఎక్కువ ఇస్తారు? అనే స్థాయికి చేరింది. తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లోనూ ఇలాంటి పోటీ కనిపిస్తోంది. అయితే ఈ పరిణామాన్ని ఒక్క రాజకీయ పార్టీకి ఆపాదించడం కూడా సరికాదు. బిజెపితోపాటు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, డిఎంకె, అన్నాడిఎంకె, ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా ఇటువంటి పోటీలో భాగమయ్యాయి. సమస్య ఏ ఒక్క పార్టీది కాదు.. వ్యవస్థాగతమైనది.అసలు ఆందోళన ఆర్థిక భారం. 21 రాష్ట్రాల్లో సబ్సిడీలు, నగదు బదిలీలు 201819లో రూ. 3.86 లక్షల కోట్ల నుంచి 202324లో రూ. 7.59 లక్షల కోట్లకు దాదాపు రెట్టింపయ్యాయి. 202526లో ఈ మొత్తం రూ. 9.73 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. పిఆర్ఎస్ ప్రకారం.. ప్రధాన యుసిటి పథకాలు అమలు చేస్తున్న 12 రాష్ట్రాల్లో ఆరు రాష్ట్రాలు 202526లో రెవెన్యూ లోటును అంచనా వేశాయి. కర్ణాటకలో యుసిటి వ్యయం లేకపోతే రాష్ట్ర రెవెన్యూ మిగులు 0.3 శాతంగా ఉండేదని, ఈ వ్యయాన్ని కలిపితే 0.6 శాతం లోటు ఏర్పడుతుందని అంచనా. పెరుగుతున్న సబ్సిడీలు, బదిలీలతో వచ్చే ఆర్థిక ప్రమాదాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా పలుమార్లు హెచ్చరించింది. ఉత్పాదక వ్యయానికి, ముఖ్యంగా మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం వంటి అభివృద్ధి రంగాలకు కేటాయించే నిధులకు ఇలాంటి పథకాలు పరిమితులు సృష్టించకూడదని సూచించింది. వేగంగా పెరుగుతున్న నగదు బదిలీలు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, మానవ వనరులపై ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉందని ఆర్థిక సర్వే కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇది దేశంలోని నిరుద్యోగ సమస్యతో నేరుగా ముడిపడిన అంశం. నగదు బదిలీలు తక్షణ ఉపశమనం కలిగించవచ్చు. కుటుంబ వినియోగాన్ని పెంచవచ్చు. కానీ అవి కర్మాగారాలను, పారిశ్రామిక కారిడార్లను, పరిశోధనా సంస్థలను, నైపుణ్య ఆధారిత ఉద్యోగాలను సృష్టించవు. యువతకు శాశ్వతంగా ప్రభుత్వ సాయం కంటే.. స్థిరమైన, గౌరవప్రదమైన ఆదాయాన్ని అందించే ఆర్థిక వ్యవస్థ అవసరం.2022లో ఎన్నికల ఉచిత హామీలపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు వాటి ఆర్థిక ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేసింది. 2026 ఫిబ్రవరిలోనూ బాధ్యతారహితమైన ఎన్నికల ముందు ఉచిత హామీలు అభివృద్ధికి ఆటంకం కలిగించే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. అయితే ఈ వ్యాఖ్యలను సంక్షేమానికి వ్యతిరేకంగా చూడకూడదు. ప్రజాధనాన్ని ఎన్నికల హామీల ద్వారా ఖర్చు చేయడానికి ముందు.. దాని ఆర్థిక భారం, అభివృద్ధి ప్రాధాన్యాలపై ప్రభావం గురించి పారదర్శకత ఉండాలన్నదే అసలు ప్రశ్న.పార్టీలు ఒకదానికొకటి మించి హామీలు ఇవ్వడం మొదలైతే ఎన్నికలు ప్రభుత్వ వనరుల వేలంగా మారే ప్రమాదం ఉంది. ఒకసారి ప్రయోజనం అందించడం ప్రారంభించిన తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవడం రాజకీయంగా కష్టమవుతుంది. దీంతో ఎన్నికల హామీ హక్కుగా మారుతుంది.. ఆ హక్కు ప్రభుత్వంపై ఆర్థిక బాధ్యతగా మారుతుంది.. ఆ బాధ్యత అభివృద్ధి వ్యయాన్ని పరిమితం చేస్తుంది. తదుపరి ఎన్నికల్లో మరింత పెద్ద హామీలకు ఒత్తిడి పెరుగుతుంది. ఇదే పోటీ ప్రజాకర్షక రాజకీయాల విషచక్రం.అయితే ఉచిత పథకాలు ఎన్నికల్లో విజయాన్ని హామీ ఇస్తాయా? ఇటీవలి ఎన్నికలు అందుకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు. అసోంలో సంక్షేమం ఎన్నికల వ్యూహంలో కీలకంగా పనిచేసినప్పటికీ.. పశ్చిమ బెంగాల్ ఫలితాలు బలమైన సంక్షేమ వ్యవస్థ ఉన్నంత మాత్రాన అధికార పార్టీ విజయం ఖాయమని చెప్పలేమని చూపించాయి. తమిళనాడులోనూ సంక్షేమం ఒక్కటే ఓటర్ల నిర్ణయాన్ని శాశ్వతంగా ప్రభావితం చేయడం లేదని స్పష్టమవుతోంది. అందువల్ల సంక్షేమాన్ని ఎన్నికల ఉచిత హామీల నుంచి వేరు చేసి చూడాల్సిన అవసరం ఉంది. పేద మహిళ తన కుమార్తె చదువు కొనసాగించడానికి, పోషకాహార అవసరాలు తీర్చుకోవడానికి అందే సాయం సామాజికంగా విలువైనదే. అయితే మహిళలకు నైపుణ్య శిక్షణ, రుణ సదుపాయం, మార్కెట్ అవకాశాలు, వ్యాపార ప్రోత్సాహం, ఉపాధితో నగదు సాయాన్ని అనుసంధానిస్తే దాని ప్రభావం మరింత విస్తరిస్తుంది. బ్రెజిల్‌లోని ‘బోల్సా ఫామిలియా’ వంటి పథకాలు నగదు సాయాన్ని విద్య, ఆరోగ్యంతో అనుసంధానించాయి. లక్ష్యం కేవలం డబ్బు ఇవ్వడం కాదు.. మానవ వనరుల అభివృద్ధి ద్వారా పేదరికం తరతరాలకు కొనసాగకుండా చూడటం. భారత్ కూడా సంక్షేమాన్ని ప్రజలను ప్రభుత్వంపై ఆధారపడేలా కాకుండా ఆర్థికంగా స్వావలంబులుగా మార్చే దిశగా మలచాలి.ప్రధాన ఎన్నికల హామీలకు సంబంధించిన ఐదేళ్ల ఆర్థిక వ్యయం, నిధుల సమీకరణ మార్గాలను వెల్లడించడం, స్వతంత్ర ఆర్థిక పరిశీలనకు అవకాశం కల్పించడం, మేనిఫెస్టో హామీలపై పారదర్శకతను పెంచడం అవసరం. రాష్ట్రాలు మధ్యకాలిక వ్యయ ప్రణాళికలను రూపొందించాలి. తద్వారా పునరావృత సంక్షేమ వ్యయాలు మూలధన పెట్టుబడులకు అడ్డంకిగా మారకుండా చూడవచ్చు. ఎంపిక సంక్షేమమా? అభివృద్ధా? అన్నది కాదు. లక్ష్యం అభివృద్ధి ద్వారా సంక్షేమాన్ని అందించడమే కావాలి. పేదలకు సామాజిక భద్రత, మహిళలకు ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగాలు అవసరం. అయితే ఇవన్నీ వచ్చే ఎన్నికల వరకే కాకుండా.. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు ఆలోచించాలి.విజయవంతమైన సంక్షేమ రాజ్యానికి కొలమానం ఎంతమంది ప్రభుత్వ సాయంపై ఆధారపడి ఉన్నారన్నది కాదు.. ఎంతమంది విద్య, నైపుణ్యాలు, ఉపాధి, ఆర్థిక భద్రతను సంపాదించుకుని గౌరవప్రదమైన జీవితాన్ని స్వతంత్రంగా నిర్మించుకోగలిగారన్నదే. ప్రజలను కేవలం లబ్ధిదారులుగా, ఎన్నికలను ప్రభుత్వ ప్రయోజనాల వేలంగా మార్చినప్పుడు ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ఈ ఉచిత హామీల ఉచ్చు నుంచి బయటపడాలంటే సంక్షేమాన్ని రద్దు చేయాల్సిన అవసరం లేదు. రాజకీయ వాగ్దానాన్ని మాత్రం మార్చాలి. ‘ప్రతి నెలా మీరు నాకు ఏమిస్తారు?’ అనే ప్రశ్న నుంచి.. ‘నేను నా భవిష్యత్తును నేనే నిర్మించుకునేలా ఎలాంటి ఆర్థిక వ్యవస్థను మీరు నిర్మిస్తారు?’ అనే ప్రశ్న దిశగా ప్రజాస్వామ్యం సాగాలి. ఓట్లు కొనడం, పౌరులను నిర్మించడం మధ్య ఉన్న తేడా ఇదే.

# హెచ్చరిక బోర్డు ఓకే - ఆక్రమణలపై చర్యలేవి?

ఖమ్మం : ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై గత కొద్ది సంవత్సరాల నుండి రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కోట్లాది విలువైన భూములను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు అట్టి స్థలాలలో ప్రభుత్వ స్థలాలుగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు సర్వే నంబర్ 142లో ఆక్రమణలకు గురి అయ్యిందని భావించిన మండల రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఆ ప్రదేశంలో ఏర్పాటు చేశారు. స్థానిక జిపిఓ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జిపిఓ లు బోర్డును ఏర్పాటు చేసి మాట్లాడారు. సర్వే నెంబర్ 142లో సుమారు మూడు ఎకరాల భూమి, దాదాపు రూ.15 కోట్ల విలువ ఉంటుందని, ఈ ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారని తిరిగి తాము స్వాధీనం చేసుకుని బోర్డు పెట్టడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఇకనుంచి ఈ స్థలంలో ఆక్రమణ చర్యలు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిపిఓ కోటేశ్వరరావు హెచ్చరించారు.

అక్కడో తీరు – ఇక్కడ తీరు

మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారు. అయితే ఇదే సమయంలో స్థానికుల నుండి పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ స్థలంకు కూత వేటు దూరంలో గత కొద్ది నెలల క్రితం రెవెన్యూ అధికారులు గిరిజన వ్యక్తులు కొందరు అసైన్డ్ ల్యాండ్ ని ఆక్రమణ చేశారని అట్టి స్థలాన్ని స్వాధీనం చేసుకుని బోర్డును పెట్టారు. ఆ ప్రదేశంలో సదరు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న ఫెన్సింగ్ జెసిబిల సహాయంతో తొలగించారు. వారు నాటుకున్న మొక్కలను సైతం పూర్తిగా ఆనవాళ్లు లేకుండా తొలగించడం జరిగింది. అయితే బుధవారం స్వాధీనం చేసుకున్న స్థలంలో ఫెన్సింగ్ జోలికి వెళ్లకుండా, ఆ స్థలంలో వివిధ నిర్మాణాలు ఉన్నప్పటికీ వాటి జోలికి వెళ్లకుండా కేవలం హెచ్చరిక బోర్డును శాశ్వతంగా కాకుండా. మట్టిలో ఉంచి వెళ్లడం పలు సందేహాలకు తాగిస్తుంది. అనేకమార్లు ఆక్రమణలకు



పాల్పడినట్లు తెలిపిన అధికారులు వారిపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని చర్చ జరుగుతుంది. ప్రభుత్వ అధికారులు ప్రైవేటు నిర్మాణాలను తొలగిస్తారా లేక వేచి చూసే ధోరణి కనబరుస్తారా అనేది వేచి చూడాల్సిందే.

## నిరసన స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడమా?

కారేపల్లి, ఎర్రవల్లిలో ప్రజాస్వామ్యబద్ధంగా డప్పులు కొట్టి నిరసన తెలిపిన ప్రదేశంలో అనంతరం పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడాన్ని కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు తీవ్రంగా ఖండించారు. నిరసన తెలిపిన ప్రదేశాన్ని అపవిత్రమైనదిగా భావించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కు ఉందని పేర్కొన్నారు. తమకు నచ్చని అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వారిని కించపరిచేలా లేదా అవమానించేలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. నిరసన స్థలంలో పసుపు నీళ్లు చల్లడం ద్వారా నిరసనకారుల పట్ల తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. రాజకీయాల్లో విమర్శలు, నిరసనలు సహజమేనని, వాటికి రాజకీయంగానే

# రోడ్డుపై గుంతల పూడ్చివేతకు.. ఏపీలో సరికొత్త టెక్నాలజీ



నంద్యాల : ఏపీలోని నంద్యాల జిల్లాలోని నల్లమల కొండల పాదాల వద్ద ఉన్న ముడిగేడు–సంజమల రోడ్డు ప్రతి వర్షాకాలంలో ఘోరంగా దెబ్బతినేది. ఈ ప్రాంతంలోని సిమెంట్ ప్లాంట్లకు సున్నపురాయి, గ్రానైట్ క్వారీల నుంచి రాళ్లు భారీ ట్రక్కుల్లో రవాణా అవుతుండటంతో రోడ్డు ఉపరితలం పగుళ్లు, లోతైన గుంతలుగా మారిపోయేది. బనగానపల్లె నియోజకవర్గంలోని ఈ స్ట్రెచ్ చాలా కాలంగా భారీ సరుకు రవాణా ఒత్తిడికి గురైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2025 జూలై 4న ఆంధ్రప్రదేశ్ రోడ్లు మరియు భవనాల శాఖ డానిష్ ఆస్ఫాల్ట్ రీన్ఫోర్సింగ్ ఫైబర్ టెక్నాలజీతో మొట్టమొదటి పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ సాంకేతికత ఇప్పటికే హీత్రో విమానాశ్రయ రన్‌వేలు, దుబాయ్ మోటార్‌వేలు, జర్మనీ–ూ7 హైవేల్లో విజయవంతంగా ఉపయోగించబడుతోంది.డానిష్ ఫైబర్స్ A/S కంపెనీ 40 సంవత్సరాలకు పైగా అనుభవంతో తయారు చేసిన ఈ వైకింగ్ ఆస్ఫాల్ట్ ఫైబర్లు.. అరమిడ్ (బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్‌లలో వాడే బలమైన పదార్థం), పాలియోలెఫిన్‌ల మిశ్రమంతో తయారు చేయబడతాయి. ఒక టన్ను బిటుమెన్‌కు ఒక కిలోగ్రాము కంటే తక్కువ పరిమాణంలో ఈ ఫైబర్లను వేడి బిటుమెన్‌లో కలిపినప్పుడు అవి రోడ్డు లోపల వెబ్ లాంటి నిర్మాణాన్ని ఏర్పరుస్తాయి. దీని వల్ల ఒత్తిడి ఒక చోట కేంద్రీకరించకుండా సమానంగా పంపిణీ అవుతుంది. తద్వారా పగుళ్లు మొదలవకుండా నిరోధిస్తాయి. పరీక్షల ప్రకారం రట్ డెప్త్ 50% కంటే ఎక్కువ తగ్గుతుంది. ఈ ఫైబర్లు –26ీజ వరకు కూడా స్థిరంగా ఉంటాయి. రాయలసీమ వాతావరణానికి సరిపోతాయి కూడా.ఈ ఫైబర్–రీన్ఫోర్స్డ్ రోడ్డు.. సాధారణ బిటుమెన్ రోడ్ల కంటే 50% ఎక్కువ కాలం నిలబడుతుందని, మరమ్మతుల ఫ్రీక్వెన్సీ తగ్గి రాష్ట్ర దీర్ఘకాలిక నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అధికారులు ఆశిస్తున్నారు. డానిష్ ఫైబర్స్ బనగానపల్లె స్ట్రెచ్‌ను ట్రయల్‌గా చేపట్టగా.. వర్షాకాలాల్లో బాగా పనిచేస్తే రాష్ట్రవ్యాప్త రోడ్ల నెట్‌వర్క్‌లో ఈ సాంకేతికతను విస్తరించే అవకాశం ఉంది. నంద్యాల జిల్లా సిమెంట్, గ్రానైట్ ప్రాసెసింగ్ హబ్‌గా మారడంతో రోడ్లపై భారీ ఒత్తిడి పెరిగింది. అందుకే ఈ స్ట్రెచ్‌ను స్ట్రెస్ టెస్ట్‌గా ఎంచుకుని.. విజయం సాధిస్తేనే నిధులు కేటాయించాలని నిర్ణయించారు.

# కబళిస్తున్న మైనింగ్...

హైదరాబాద్,ములుగు జిల్లాలో ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టుపై స్థానికులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రఖ్యాతి గాంచిన రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై మైనింగ్ ప్రభావం చూపే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభ్యంతరాల నేపథ్యంలో ములుగు జిల్లా కలెక్టర్ ప్రతిపాదిత ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేశారు. శాస్త్రీయ, పర్యావరణ అధ్యయనాల అనంతరం నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన తెలంగాణలోని చారిత్రక రామప్ప ఆలయానికి సమీపంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో చేపట్టాలని ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించి స్థానికులు, పాలంపేట స్పెషల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎస్‌డీఏ) కమిటీ సభ్యులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ (కేహెచ్‌టీ) ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు భోర్కడే మంగళవారం ప్రతిపాదిత మైనింగ్ ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మైనింగ్ ప్రాజెక్టుపై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ హేమంత్.. శాస్త్రీయ, పర్యావరణపరమైన అంచనాలు పూర్తి అయిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.ఈ అంశంపై నిర్వహించిన సమావేశాల్లో జిల్లా యంత్రాంగంతో పాటు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, పీఎస్‌డీఏ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయం , చెరువు, పరిసర గ్రామాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారసత్వ పరిరక్షణ వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌ను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్, మాజీ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు వ్యతిరేకించారు. గనుల తవ్వకాల కోసం బ్లాస్టింగ్, డ్రిల్లింగ్, భారీ యంత్రాల వినియోగం చేపడితే రామప్ప చెరువు నిర్మాణంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రామప్ప చెరువుకు సుమారు 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని.. దాని నిర్మాణానికి ఏదైనా నష్టం జరిగితే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని పాండురంగారావు పేర్కొన్నారు. చెరువుకు సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టడం కూడా పలు ప్రమాదాలకు దారితీయవచ్చని.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని కోరారు.ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు 40.4 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసేందుకు సింగరేణి గతంలో అనుమతులు పొందినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం 19 ఏళ్ల మైనింగ్ లీజు కూడా పొందినట్లు సమాచారం. ప్రాజెక్టు పరిధిలోని కొంత భూమిని సంస్థ ఇప్పటికే సేకరించి.. భూయజమానులకు పరిహారం చెల్లించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ప్రాజెక్టులో సుమారు 314 హెక్టార్ల అటవీ భూమి.. మరో 1,448 హెక్టార్ల వ్యవసాయ, ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉన్నట్లు పేర్కొంటున్నారు. దీంతో మైనింగ్ వల్ల పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిపై కూడా ప్రభావం ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు 2021 జూలైకి ముందే సమర్పించగా.. అదే ఏడాది డిసెంబర్‌లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలనే ప్రణాళిక ఉన్నట్లు సమాచారం. కానీ.. 2021 జూలై 25వ తేదీన రామప్ప ఆలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది. దీంతో పాలంపేట, పరిసర గ్రామాల ప్రజలు ఆలయ పరిరక్షణ కోసం సేవ్ రామప్ప ఉద్యమాన్ని ప్రారంభించారు.

# యూపీఐ ఛార్జీలపై 'సుప్రీం' సవాల్ !




న్యూఢిల్లీ, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై కొత్తగా తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం సుప్రీంకోర్టుకు చేరింది. రూ.2 వేలకుపైబడిన నిర్దిష్ట పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధించడాన్ని సవాలు చేస్తూ అడ్వకేట్ అంజన్ దత్తా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొత్త విధానం చట్టబద్ధత, మర్చంట్ లావాదేవీలపై రుసుము విధించే విధానం వంటి అంశాలను పిటిషన్‌లో సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌తో యూపీఐ ఛార్జీల అంశం ఇప్పుడు న్యాయపరమైన పరిశీలనకు వెళ్లింది. దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకంగా మారిన యూపీఐలో కొత్త మార్పులు రానున్నాయి. ఎన్‌పీసీఐ ప్రకటించిన కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానం అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. అయితే ఈ నిర్ణయంపై వినియోగదారుల్లో ప్రధాన సందేహం.. ఇకపై యూపీఐ చెల్లింపులకు కూడా ఛార్జీలు పడతాయా? అన్నదే ప్రశ్న. కొత్త విధానం అందరికీ వర్తించదు. సాధారణ వినియోగదారులు చేసే రోజువారీ యూపీఐ చెల్లింపులపై ఎలాంటి ప్రత్యక్ష ప్రభావం ఉండదు. రూ.2 వేలకుపైగా విలువైన వ్యాపార చెల్లింపులు చేసే మర్చంట్లపైనే ప్రధాన ప్రభావం ఉండనుంది.

అసలు మార్పు ఏంటి?

కొత్త ఎండీఆర్ విధానం ప్రకారం.. రూ.2 వేలకుపైగా విలువైన కొన్ని వ్యాపార యూపీఐ లావాదేవీలపై గరిష్ఠంగా 0.4 శాతం వరకు మర్చంట్ డిస్కౌంట్ రేట్ వర్తించనుంది. ఉదాహరణకు ఒక కస్టమర్ రూ.5 వేల విలువైన వస్తువులు కొనుగోలు చేసి యూపీఐ ద్వారా చెల్లిస్తే.. ఆ లావాదేవీపై నిర్ణీత ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని నేరుగా వినియోగదారుడి నుంచి వసూలు చేయరు. చెల్లింపు సేవల నిర్వహణలో భాగంగా వ్యాపారి ఖాతాకు ఇది వర్తిస్తుంది.

ఎవరికి ఊరట?

సాధారణ వినియోగదారులకు ప్రత్యక్షంగా భారం లేదు. కానీ వ్యాపారులు తమకు వచ్చే భారాన్ని వినియోగదారులపై సర్దుబాటు చేసే అవకాశం ఉందని పలువురు వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కొత్త విధానంలో సాధారణ యూపీఐ వినియోగదారులకు ప్రత్యక్ష భారం ఉండదు. స్నేహితులకు డబ్బులు పంపడం, చిన్న మొత్తాల చెల్లింపులు, రూ.2 వేలలోపు కొనుగోళ్లపై ఎలాంటి ప్రభావం ఉండదు.

చిన్న వ్యాపారులకు మినహాయింపు

చిన్న వ్యాపారులపై భారం పడకుండా ఎన్‌పీసీఐ ప్రత్యేక మినహాయింపులు కల్పించింది. నెలకు రూ.లక్ష వరకు క్యూఆర్ కోడ్ ద్వారా బ్యాంకు ఖాతాల్లోకి చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు ఎండీఆర్ వర్తించదు. దీంతో కిరాణా దుకాణాలు, వీధి వ్యాపారులు, చిన్న స్థాయి సేవలందించే వారికి ఊరట లభించనుంది.

డిజిటల్ చెల్లింపు వ్యవస్థకు ప్రయోజనం

యూపీఐ వ్యవస్థ నిర్వహణకు అవసరమైన సాంకేతిక ఖర్చులు, మౌలిక సదుపాయాల నిర్వహణ పెరుగుతున్న నేపథ్యంలో ఎండీఆర్ ద్వారా చెల్లింపు వ్యవస్థలకు ఆదాయ మార్గం ఏర్పడుతుంది. దీంతో యూపీఐ మౌలిక వసతులు, సైబర్ భద్రత, డిజిటల్ సేవల విస్తరణ మరింత మెరుగుపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎవరిపై ప్రభావం?

అధిక మొత్తాల్లో యూపీఐ చెల్లింపులు స్వీకరించే పెద్ద వ్యాపార సంస్థలపై ఈ విధానం ప్రభావం చూపనుంది. రిటైల్ చైన్లు, పెద్ద సంస్థలు, అధిక విలువైన లావాదేవీలు నిర్వహించే వ్యాపారులు అదనపు నిర్వహణ ఖర్చును భరించాల్సి రావచ్చు. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం వంటి కొన్ని రంగాల్లో రూ.2 వేలకుపైగా చెల్లింపులకు ఒక్కో లావాదేవీపై ఫ్లాట్ ఎండీఆర్ వర్తించే అవకాశం ఉంది.

వినియోగదారుడి జేబుపై భారం పడుతుందా?

ప్రస్తుత నిబంధనల ప్రకారం వినియోగదారుడి నుంచి నేరుగా ఎండీఆర్ వసూలు చేయరు. అయితే కొందరు వ్యాపారులు నిర్వహణ ఖర్చులను ధరల్లో సర్దుబాటు చేసే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధరల పెంపు లేదా సర్‌చార్జీల రూపంలో ఆ భారం వినియోగదారుడిపై పడుతుందా అన్నది భవిష్యత్‌లో స్పష్టమవుతుంది.

రూ.300 గరిష్ఠ పరిమితి

ఎండీఆర్ ఛార్జీలకు గరిష్ఠ పరిమితిని కూడా నిర్ణయించారు. రూ.75 వేల లేదా అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు కూడా ఒక్కో చెల్లింపుపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఎండీఆర్ వర్తిస్తుంది.

95 శాతం లావాదేవీలపై ప్రభావం ఉందదా?

ఎన్‌పీసీఐ ప్రకారం.. ప్రస్తుతం యూపీఐ వ్యాపార లావాదేవీల్లో ఎక్కువ భాగం రూ.2 వేలలోపే ఉంటాయి. అందువల్ల కొత్త ఎండీఆర్ విధానం ప్రభావం అధిక విలువైన వ్యాపార చెల్లింపులకే పరిమితం కానుంది. కొత్త ఎండీఆర్ విధానం వల్ల సాధారణ యూపీఐ వినియోగదారులకు ప్రత్యక్ష నష్టం ఉండదు. చిన్న వ్యాపారులకు కూడా మినహాయింపులు ఉండటంతో ప్రభావం పరిమితంగానే ఉండనుంది. అయితే పెద్ద మొత్తాల్లో యూపీఐ చెల్లింపులు స్వీకరించే వ్యాపార సంస్థలకు మాత్రం అదనపు నిర్వహణ ఖర్చుగా మారే అవకాశం ఉంది.

# కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నా.. ఐబొమ్మ రవికి ఆర్థిక కష్టాలు!

హైదరాబాద్,తెలుగు సినీ ప్రియులకు 'ఐబొమ్మ' గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. థియేటర్లో సినిమా చూడలేని ఎంతోమందికి ఈ వెబ్సైట్ కేరాఫ్ అడ్రస్?గా మారింది. ఒక సాధారణ వెబ్ డిజైనర్ నుండి కోట్లు గడించే స్థాయికి ఎదిగాడు. అసలు పేరు ఇమ్మడి రవి (39). ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నానికి చెందిన వ్యక్తి. ఈయన ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ అయిన 'ఐబొమ్మ' వ్యవస్థాపకుడు, ప్రధాన నిర్వాహకుడు. ఇతను విదేశాల్లో (కరీబియన్ దీవుల్లోని సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశ పౌరసత్వం కలిగి ఉంటూ) తలదాచుకుని ఈ నెట్‌వర్క్‌ను ఆపరేట్ చేశాడు. థియేటర్లలో విడుదలైన కొత్త సినిమాలు, ఓటీటీ లో స్ట్రీమ్ అయ్యే చిత్రాలను వెంటనే పైరసీ చేసి, ఎలాంటి అనుమతులు లేకుండా తన 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో ఉచితంగా ప్రసారం చేసేవాడు. ఈ వెబ్‌సైట్‌లో సుమారు 21,000లకు పైగా సినిమాలు అందుబాటులో ఉండేవి. పైరసీ ద్వారా భారీగా గడించడంతో పాటు, సుమారు 5 మిలియన్ల (50 లక్షల మంది) యూజర్ల వ్యక్తిగత డేటాను సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కార్యకలాపాల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించాడు. టాలీవుడ్ నిర్మాతలు, ఇండస్ట్రీ పెద్దలు ఐబొమ్మ పైరసీ వల్ల భారీగా ఆర్థిక నష్టాలు వస్తున్నాయని సైబర్ క్రైమ్ పోలీసులకు తరచూ ఫిర్యాదులు చేయడంతో హైదరాబాద్ సీసీఎస్ , సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఫ్రాన్స్ నుంచి భారతదేశానికి (హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి) వచ్చిన రవిని నవంబర్ 2025లో పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న సుమారు రూ. 3 కోట్లకు పైగా బ్యాంక్ నిధులను ఫ్రీజ్ చేసి, చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. జైలు శిక్ష అనుభవించిన రవి తరవాత బయటకు వచ్చాడు. ఆయనకు సంబంధించిన న్యాయపరమైన విచారణ ఇంకా కోర్టులో కొనసాగుతోంది. ఇది అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకప్పుడు విదేశాల్లో లగ్జరీగా బతికిన ఐబొమ్మ రవిని ఇప్పుడు ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. కనీసం కుటుంబాన్ని పోషించుకోలేని స్థితిలో ప్రస్తుతం రవి ఉన్నాడు. దీంతో ఆయన తన బ్యాంక్ ఖాతాలను అన్ ఫ్రీజ్ చేయాలంటూ నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. ఐబొమ్మ పైరసీ సినిమాల కేసు దర్యాప్తులో భాగంగా రవిని అరెస్ట్ చేసిన తరవాత బ్యాంకు ఖాతాలను, ప్రాపర్టీ డిపాజిట్లను ఫ్రీజ్ చేశారు. అయితే, బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ అవ్వడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, తన కుటుంబ పోషణ, నిత్యవసరాలు వైద్య ఖర్చులకు కూడా తీవ్ర ఇబ్బందిగా మారిందని రవి కోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. కుటుంబ జీవనం కొనసాగించడానికి, కనీస అవసరాలు తీర్చుకునేందుకైనా తన ఫ్రీజ్ అయిన బ్యాంక్ ఖాతాలలో కొన్నింటినైనా అన్ ఫ్రీజ్ చేయాలని విజ్ఞప్తి చేశాడు. దీంతో ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన కోర్టు పోలీసుల వివరణ కోరే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ప్రేమ వివాహం ... ఆర్థిక కష్టాలు

విశాఖపట్నానికి చెందిన రవి, ఒక వెబ్ డిజైనర్. 2016లో ఒక సంపన్న కుటుంబానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే, రవి సంపాదన తక్కువ కావడంతో భార్యను, పుట్టిన కూతురిని పోషించడం కష్టంగా మారింది. అత్తమామల నుండి, భార్య నుండి డబ్బు విషయంలో తరచూ అవమానాలు ఎదుర్కొనేవాడు. "డబ్బు సంపాదించడం చేతకాదా?" అనే మాటలు అతన్ని తీవ్రంగా బాధించాయి. ఆ అవమానాలే అతన్ని ఎలాగైనా డబ్బు సంపాదించాలనే కసిని పెంచాయి.

ఐబొమ్మ ఆవిర్భావం

డబ్బు కోసం మార్గాలను వెతుకుతున్న రవికి, అప్పటికే ఉన్న మూవీ రూల్స్,




తమిళ్ రాకర్స్ వంటి పైరసీ వెబ్సైట్లపై కన్ను పడింది. ఆ సైట్లలో సినిమాలు చూడడం సామాన్యులకు కష్టంగా ఉండేది (ఎక్కువ యాడ్స్, టోరెంట్స్ డౌన్లోడ్ కష్టాలు). తన వెబ్ డిజైనింగ్ స్కిల్స్ ఉపయోగించి, యూజర్లకు చాలా సులభంగా, ఎటువంటి లాగిన్ లేకుండా, క్లీన్ ఇంటర్ఫేస్తో సినిమా చూసేలా 2019లో 'ఐబొమ్మ'ను డిజైన్ చేశాడు.

ఒక పక్క సక్సెస్... మరోపక్క విడాకులు

ఐబొమ్మ సైట్ అనతి కాలంలోనే విశేష ఆదరణ పొందింది. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ప్రకటనల ద్వారా రవికి భారీగా ఆదాయం రావడం మొదలైంది. మొదటి విడతలో 75 లక్షల వరకు సంపాదించాడు. సంతోషంగా ఆ డబ్బును భార్యకు చూపించినా, అప్పటికే ఆమె విడిపోవాలని నిర్ణయించుకోవడంతో 2021లో విడాకులు అయ్యాయి. ఇది రవిని మరింతగా డబ్బు వైపు నడిపించింది.

విదేశాలకు పలాయనం... అరెస్ట్

పోలీసులకు చిక్కకూడదని రవి నెదర్లాండ్స్ వెళ్లిపోయాడు. అక్కడ నుండే సర్వర్లను మెయింటైన్ చేస్తూ, ఇండియాలో ఒక టీమ్? ఏర్పాటు చేసుకున్నాడు. కేవలం ఓటీటీ లో వచ్చిన క్వాలిటీ ప్రింట్లనే అప్లోడ్ చేస్తూ సైట్ క్వాలిటీని పెంచాడు. అయితే నిర్మాతల ఫిర్యాదులతో పోలీసులు నిఘా పెంచారు. బెట్టింగ్ యాప్స్ లావాదేవీల ద్వారా తీగ లాగితే డొంక కదిలింది. ముందు రవి టీమ్?ను అరెస్ట్ చేశారు. రవి "సెయింట్ కిట్స్" అనే దేశంలో 80 లక్షలు పెట్టి పౌరసత్వం కూడా తీసుకున్నాడు. అయితే, శాశ్వతంగా విదేశాల్లో సెటిల్ అయ్యేందుకు, ఇండియాలోని ఆస్తులు అమ్మడానికి హైదరాబాద్ వచ్చినప్పుడు పోలీసులకు పట్టుబడ్డాడు.

ఐబొమ్మ రవికి ప్రజల మద్దతు ఎందుకు?

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, రవి అరెస్ట్ తర్వాత సోషల్ మీడియాలో 99% మంది అతనికి మద్దతుగా నిలిచారు. దీనికి ప్రధాన కారణాలు:

టికెట్ రేట్లు: ఒక సామాన్య కుటుంబం థియేటర్లో సినిమా చూడాలంటే రూ. 1500-2000 ఖర్చవుతోంది. ఇది వారి రెండు, మూడు రోజుల సంపాదనతో సమానం.

ఓటీటీ ఖర్చులు:అన్ని ఓటీటీల సబ్స్క్రిప్షన్లు తీసుకోవాలంటే ఏడాదికి రూ. 10,000 వరకు అవుతుంది.

సినిమా బడ్జెట్: హీరోల రెమ్యునరేషన్ల పేరుతో బడ్జెట్లు పెంచి, ఆ భారాన్ని టికెట్ రేట్ల రూపంలో సామాన్యులపై వేస్తున్నారనే ఆగ్రహం ప్రజల్లో ఉంది. పైరసీ చట్టరీత్యా నేరమే అయినప్పటికీ, సామాన్యుడికి వినోదాన్ని అందుబాటులో ఉంచాడనే కారణంతో రవి చాలా మందికి 'రాబిన్ హుడ్'లా కనిపిస్తున్నాడు. సినిమా టికెట్ రేట్లు సామాన్యుడికి అందుబాటులో ఉండేంత వరకు ఐబొమ్మ లాంటి సైట్లు పుట్టుకొస్తూనే ఉంటాయన్నది చాలా మంది అభిప్రాయం.

# హైదరాబాద్‌లోనే తొలి మెట్రో-టు-రెసిడెన్షియల్ స్కైవాక్

హైదరాబాద్, నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాసవి గ్రూప్ ఒక చారిత్రాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఎల్బీ నగర్‌లోని తమ ప్రతిష్ఠాత్మక 'వాసవి ఆనంద నిలయం' గేటెడ్ టౌన్‌షిప్‌ను ఎల్బీ నగర్ మెట్రో స్టేషన్‌తో నేరుగా అనుసంధానించే ఎలివేటెడ్ స్కైవాక్ నిర్మాణానికి సిద్ధమైంది. గతంలో పంజాగుట్ట, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లను షాపింగ్ మాల్స్ లేదా ఐటీ పార్కులకు మాత్రమే అనుసంధానించగా, నేరుగా ఒక నివాస సముదాయానికి మెట్రో కాంకోర్స్ నుండి స్కైవాక్ నిర్మించడం హైదరాబాద్‌లోనే మొదటిసారి. జాతీయ రహదారి-65 (NH-65) పై అత్యంత వేగంగా వెళ్లే ట్రాఫిక్ నుండి నివాసితులకు, పాదచారులకు పూర్తి రక్షణ కల్పిస్తూ ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ఈ స్కైవాక్ అందుబాటులోకి వస్తే, దాదాపు 10 నుండి 12 నిమిషాల పాటు రోడ్డుపై ప్రమాదకరంగా నడిచే అవసరం లేకుండా, కేవలం 2 నుండి 3 నిమిషాల వ్యవధిలోనే నివాసితులు తమ ఇళ్ల నుండి నేరుగా మెట్రో స్టేషన్ చేరుకోవచ్చు.

అనుమతులు, సాంకేతిక ప్రత్యేకతలు మరియు ప్రాజెక్టు గడువు

ఈ స్కైవాక్ నిర్మాణానికి సంబంధించి ఎల్‌అండ్‌టి మెట్రో రైల్, ట్రాఫిక్ పోలీసులతో పాటు ఐఐటీ (IIT) హైదరాబాద్ నుండి అవసరమైన అన్ని రకాల సాంకేతిక,



చట్టబద్ధ అనుమతులు లభించాయి. ఐఐటీ హైదరాబాద్ స్వయంగా డిజైన్ చేసి తనిఖీ చేసిన ఈ నిర్మాణం, ఎల్బీ నగర్ మెట్రో కాంకోర్స్ స్థాయికి అనుసంధానమై ఉంటుంది. దీని కోసం చీఏ-65 ఫుట్‌పాత్ వెంట 10 ప్రధాన స్తంభాలను నిర్మిస్తున్నారు. ప్రతి స్తంభం 5.94 మీటర్ల వ్యాసం, 8.64 మీటర్ల ఎత్తుతో అత్యాధునిక ప్రమాణాలతో రూపుదిద్దుకోనుంది. నివాసితుల సౌకర్యార్థం ఇందులో ర్యాంప్‌లు, లిఫ్ట్‌లు మరియు మెట్ల సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.

# కాంగ్రెస్ నేతల దారుణ హత్య కేసు.. ఎన్ఐఏ కోర్టు సంచలన తీర్పు.. 10 మందికి మరణశిక్ష

ఛత్తీస్‌గఢ్: 2013లో ఛత్తీస్‌గఢ్‌లోని జిరమ్ ఘాటి వద్ద మావోయిస్టులు జరిపిన భయానక దాడికి సంబంధించి కీలక తీర్పు వెలువడింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ దారుణ కాండలో 29 మంది ప్రాణాలు కోల్పోగా ఏకంగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఘటన జరిగిన దాదాపు 13 ఏళ్ల తర్వాత నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (NIA) కోర్టు నిందితులకు ఉరిశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అసలేం జరిగిందంటే?

2013 మే 25న కాంగ్రెస్ నాయకులు 'పరివర్తన్ ర్యాలీ'ని ముగించుకుని తిరుగుపయనమయ్యారు. బస్తర్ జిల్లాలోని దర్భా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జిరమ్ ఘాటి జాతీయ రహదారిపై వారి కాన్వాయ్ వెళ్తుండగా మావోయిస్టులు ఒక్కసారిగా మెరుపు దాడి చేశారు. ఈ దారుణ ఘటనలో అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, అసెంబ్లీలో మాజీ ప్రతిపక్ష నేత మహేంద్ర కర్మా, మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్ సహా పలువురు సీనియర్ నాయకులు దారుణంగా హత్యకు గురయ్యారు. నాయకులతో పాటు పలువురు భద్రతా సిబ్బంది, సాధారణ పౌరులు కలిపి మట్టుత్తం 29 మంది ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు.

నిందితులకు ఉరిశిక్ష ఖరారు

దీనిపై సుదీర్ఘ విచారణ అనంతరం జగదల్‌పూర్‌లోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు స్పెషల్ జడ్జ్ అభయ్ సింగ్ రాజ్‌పుత్ ఇవాళ చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణలో భాగంగా మొత్తం 101 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయగా వేలాది డాక్యుమెంట్లను కోర్టు పరిశీలించింది. అయితే ఈ నెల ప్రారంభంలోనే ఇద్దరు మహిళలతో సహా మొత్తం 10 మందిని దోషులుగా కోర్టు నిర్ధారించింది. బుధవారం వీరికి శిక్ష ఖరారు చేస్తూ 10 మంది దోషులకు మరణశిక్ష (ఉరిశిక్ష) విధిస్తూ తీర్పు ఇచ్చింది. దాంతో పాటు రూ. 800 చొప్పున జరిమానా న్యాయమూర్తి విధించారు. హైకోర్టు ఈ శిక్షను ఖరారు చేసే వరకు దోషులు సెంట్రల్ జైలులోనే ఉంటారని ఈ తీర్పుపై 30 రోజుల్లోగా హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం స్పష్టం చేసింది.

దాడి వెనుక మావోయిస్టుల కుట్ర

నిషేధిత సీపీఐ (మావోయిస్ట్) సంస్థకు చెందిన సాయుధ కేడర్లు, స్థానిక డివిజన్లతో




కలిసి పక్కా పథకం ప్రకారం ఈ దాడికి పాల్పడినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. కాంగ్రెస్ నాయకులను, వారి వెంట ఉన్న భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని అంతమొందించడమే ధ్యేయంగా ఈ క్రిమినల్ కుట్ర పన్నినట్లు స్పష్టమైంది. మావోయిస్టులు తమ 'టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్' లో భాగంగానే ఈ దాడికి ఒడిగట్టారని ఎన్ఐఏ తన దర్యాప్తు నివేదికలో వెల్లడించింది.

తీర్పుపై రాజకీయ వివాదం

ఈ తీర్పు వెలువడిన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాజకీయం మళ్లీ వేడెక్కింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ ఈ కేసు విచారణపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ దాడి వెనుక పెద్ద వ్యక్తుల ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి స్వతంత్రంగా విచారణ జరిపే అవకాశం ఇచ్చి ఉంటే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు సూత్రధారులు బయటపడేవారని బఘేల్ అభిప్రాయపడ్డారు. అయితే బఘేల్ ఆరోపణలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించింది. బీజేపీ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ మాట్లాడుతూ.. బఘేల్‌కు ఈ కేసు విచారణపై గానీ, బాధితులకు న్యాయం జరగడంపై గానీ ఎలాంటి పట్టింపు లేదని విమర్శించారు. కేవలం ఈ విషయాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడమే ఆయన నైజమని రమణ్ సింగ్ ఆరోపించారు.

# 28 రోజుల్లో రూ. 2 కోట్లు.. వేములవాడ భీమేశ్వర స్వామికి కానుకల వర్షం



రాజన్న సిరిసిల్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ. 1.91 కోట్లకు పైగా సమకూరింది. శ్రావణ మాసం సందర్భంగా గత 28 రోజుల్లో భక్తులు సమర్పించిన నగదు, సమర్పణలను బుధవారం భీమేశ్వర సదన్ ఆవరణలో ఆలయ అధికారులు లెక్కించారు. రూ. 1,91,64,681 నగదుతో పాటు 119 గ్రాముల 500 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 9 కిలోల 800 గ్రాముల మిశ్రమ వెండి కానుకలుగా వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా హుండీల లెక్కింపు పూర్తికాకపోవడంతో గురువారం కూడా ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, ఆలయ డీఈవో ప్రతాప నవీన్ కుమార్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పోలీసులు, శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# మంత్రి పదవుల కోసం మతం మార్చుకున్నారు!! - విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు



అమరావతి,విపక్షం వైసీపీని లక్ష్యంగా చేసుకుని మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి చేస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. కొత్త రాజకీయ పార్టీ పెడతానని కొన్నిరోజులుగా చెబుతున్న విజయసాయిరెడ్డి సమయం, సందర్భం లేకుండా విపక్షంపై ఘాటు విమర్శలతో విరుచుకుపడుతుండటం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. కొత్త పార్టీ ప్రారంభిస్తానని గతంలో ప్రకటించిన సందర్భంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై మత మార్పిడి ఆరోపణలు చేసిన విజయసాయిరెడ్డి తాజాగా రెండేళ్ల క్రితం నాటి ఒక వీడియోను షేర్ చేశారు. వైసీపీలో ఎమ్మెల్యే, మంత్రి పదవులు పొందాలంటే జగన్ ను ఆకట్టుకునేందుకు మతం మార్చుకోవాల్సివచ్చేదని ఆరోపించడమే కాకుండా, ఇలా ఎంతోమంది మార్చుకున్నారో వైసీపీలో నెంబర్ వన్ చెప్పాలంటూ పోస్టు పెట్టారు. రెండేళ్ల క్రితం ఏపీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారపురెడ్డి చంద్రశేఖరరెడ్డి ప్రసంగించిన వీడియోను విజయసాయిరెడ్డి తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. "వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మాజీ, సీనియర్ ఎమ్మెల్యే 2024 ఎన్నికల ముందు చేసిన ఈ ప్రసంగంపై రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ అభిప్రాయం తెలియజేయాలి" అంటూ కోరారు. అంతేకాకుండా "గతంలో ఎంతమంది నాయకులు తమ ఎమ్మెల్యే టికెట్ల కోసం, ఆ తర్వాత ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం జగన్ గారిని ఆకట్టుకునేందుకు మతం మార్చుకున్నారో ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌లో నంబర్ వన్ సమాధానం చెప్పాలని కోరుతున్నా." అంటూ రాశారు. ఉన్నట్టుండి విజయసాయిరెడ్డి చేసిన ఈ పోస్టు రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. సహజంగా రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలకు తగిన సమయం సందర్భం ఉంటుందని, కానీ ఇప్పుడు ఎలాంటి చర్చ లేని మత మార్పిడుల అంశాన్ని విజయసాయిరెడ్డి తెరపైకి తేవడం వెనుక ఆయన ఉద్దేశం ఏమైవుంటుందో అర్థం కావడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ పార్టీ పెట్టాలని భావిస్తున్న విజయసాయిరెడ్డి విపక్షంలో ఉన్న వైసీపీ స్థానంలో ఎదగాలని భావించడంలో తప్పు లేదని, కానీ ఎప్పటిదో వీడియోను బయటకు తీసి ఇప్పుడు వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయం చెప్పాలంటూ నిలదీయడమే ఆశ్చర్యంగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీలో తనకు అన్యాయం జరిగిందని ఆరోపణలు చేస్తున్న విజయసాయిరెడ్డి ఆ పార్టీని అధినేత జగన్మోహనరెడ్డిని రాజకీయంగా దెబ్బతీయాలనే వ్యూహంతో ఇటువంటి పోస్టులు చేస్తున్నారని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. పాత వీడియోలు బయటకు తీసి కావాల్సిన విధంగా ఎడిటింగ్ చేసుకుని వైరల్ చేయాలని చేయాలని భావించడం కరెక్టు కాదని అంటున్నారు. అదే సమయంలో ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. తన స్థానంలో పార్టీలో ఎదిగిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని చూసి ఓర్వలేకే విజయసాయిరెడ్డి ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేతలు మండిపడుతున్నారు. ఇదే సమయంలో విజయసాయిరెడ్డి విమర్శలను అధికార పార్టీ హైలెట్ చేస్తోందని అంటున్నారు. కొద్దిరోజుల క్రితం వైసీపీకి చెందిన జోగి రమేష్ కుటుంబం మతం మార్చుకుందన్న విషయం వెలుగు చూడగా, మంత్రి పదవి కోసమే ఆయన మత మార్పిడి జరిగిందని ప్రత్యర్థులు ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ ప్రచారానికి బలం చేకూర్చేలా విజయసాయిరెడ్డి ప్రశ్నలు సంధిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు రాస్తుండటం ద్వారా ఒక వ్యూహం ప్రకారం వైసీపీ వ్యతిరేక రాజకీయాలు చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140